ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
కడప
జిల్లా వార్తలు
5
బుధవారం 20 మార్చి 2024

ఆ మూడింట ఉత్కంఠ



(కడప- ఆంధ్రజ్యోతి): ఎన్నికల షెడ్యూలు విడుదలైంది. మూడు చోట్ల మినహాయిస్తే బరిలో ఉండే ఫైటర్స్ ఎవరో తేలిపోయింది. వైసీపీ కడప పార్లమెంటు, ఏడు అసెంబ్లీ స్థానాలకు మళ్లీ సిట్టింగ్ లకే సీట్లు ఇచ్చింది. ఇక టీడీపీ కడప పార్లమెంటు అభ్యర్థులను ప్రకటించాల్సి ఉండగా.. జమ్మలమడుగు, బద్వేలు అసెంబ్లీ స్థానాలకు బీజేపీ అభ్యర్థులను ప్రకటించాల్సి ఉంది. ఇక కాంగ్రెస్ పార్టీ కడప ఎంపీ అభ్యర్థిగా పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల పోటీ చేస్తారనే ప్రచారం సాగుతుంది. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ షర్మిలను కడప బరిలో దిగాలని సూచించినట్లు చెబుతారు. ఈ నెల 25న కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల జాబితా ప్రకటించనుంది. షర్మిలా పోటీపై త్వరలోనే క్లారిటీ రానుంది. జిల్లాలో కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ అభ్యర్థుల జాబితాను ఇంకా ప్రకటించలేదు. ఎన్నికల నోటిఫికేషన్‌కు ఇంకా టైం ఉండడంతో త్వరలోనే షర్మిల కడప నుంచి పోటీ చేస్తే ఎంపీగా పోటీ చేయడం ఖరారు అయితే వెనువెంటనే అసెంబ్లీ అభ్యర్థుల ప్రకటన ఉండొచ్చని అంటున్నారు.

- కడప పార్లమెంటు అభ్యర్థి కోసం టీడీపీ ఐవీఆర్ సర్వే
- మాజీ ఎమ్మెల్యే వీరశివారెడ్డి, పొలిట్‌బ్యూరో శ్రీనివాసరెడ్డి పేర్లతో
- జమ్మలమడుగు, బద్వేలులో అభ్యర్థులను ప్రకటించని బీజేపీ
- కాంగ్రెస్ నుంచి షర్మిలా పోటీ?


శ్రీనివాసరెడ్డి


వీరశివారెడ్డి


వైఎస్ షర్మిల

కొనసాగుతున్న ఉత్కంఠ

జగన్‌ను గద్దె దింపేందుకు టీడీపీ, జనసేన, బీజేపీలు పొత్తు కుదుర్చుకుని కూటమిగా ఏర్పడ్డాయి. పొత్తులో భాగంగా బద్వేలు, జమ్మలమడుగు అసెంబ్లీ స్థానాలను బీజేపీకి కేటాయించారు. జమ్మలమడుగులో టీడీపీ నుంచి పోటీ చేయాలని ఇన్‌చార్జ్ భూపేష్‌రెడ్డి భావించారు. అందుకు తగ్గట్లుగానే నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటించారు. అయితే పొత్తులో భాగంగా ఈ టికెట్‌ను బీజేపీ పట్టుబట్టడంతో వారికి కేటాయించారు. ఇక్కడ నుంచి మాజీమంత్రి ఆదినారాయణరెడ్డి బరిలో దిగే అవకాశాలున్నాయని చెబుతున్నారు. ఇక బద్వేలులో కూడా టీడీపీ అభ్యర్థిగా బొజ్జ రోశన్నను బరిలో దించాలనుకున్నారు. ఆ సీటు బీజేపీకి కేటాయించారు. ఈ రెండు చోట్ల బీజేపీ అభ్యర్థులను ఇంకా ప్రకటించాల్సి ఉంది. ఏదైనా అనూహ్య మార్పులు జరిగితే తప్ప సీటు మారే అవకాశం ఉండదంటారు.

కడప ఎంపీ సీటు కోసం టీడీపీ సర్వే

కడప పార్లమెంటు అభ్యర్థి కోసం టీడీపీ ఐవీఆర్ సర్వే చేసింది. వివేకా సతీమణి సౌభాగ్యమ్మ కడప ఎంపీగా బరిలో దిగుతారని వార్తలు వచ్చాయి. అయితే రెండురోజుల క్రితం చంద్రబాబు ఐవీఆర్ సర్వే వచ్చింది. తొలుత కడప టీడీపీ అభ్యర్థి కోసం మాజీ ఎమ్మెల్యే వీర శివారెడ్డి పేరుతో సర్వే చేశారు. మళ్లీ తరువాత పార్లమెంటు అభ్యర్థి శ్రీనివాసరెడ్డి పేరిట సర్వే చేశారు. టీడీపీ కడప పార్లమెంటు, బీజేపీ ఆశిస్తున్న జమ్మలమడుగు, రాజంపేట అభ్యర్థులపై ఇంకా ఉత్కంఠ నెలకొంది.

డీఎస్సీ పరీక్షను వాయిదా వేయాలి

- సీఈసీకి ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి లేఖ

పులివెందులటౌన్, మార్చి 19: మార్చి 30 నుంచి ఏప్రిల్ 30 మధ్య జరగనున్న ఉపాధ్యాయుల ఎంపిక పరీక్షను వాయిదా వేయాలని ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు చీఫ్ ఎలక్షన్ కమిషనర్‌కు మంగళవారం ఆయన లేఖ రాశారు. ఇప్పటికే రాష్ట్రం లో ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైందని, నిరుద్యోగులు పరీక్షకు ప్రిపేర్ కావడానికి అసౌకర్యం కలుగుతుందని, అలాగే ఇప్పటికే సర్వీస్ ఉపాధ్యాయులు కూడా వేలాది మంది డీఎస్సీ పరీక్ష రాస్తున్నారన్నారు. ఎస్‌జీటీలుగా పనిచేసే అనేక మంది స్కూల్ అసిస్టెంట్ పరీక్ష రాస్తున్నారని తెలిపారు. వీరిలో చాలా మంది స్పాట్ వాల్యుయేషన్‌కు, ఎన్నికల విధులకు, ట్రైనింగ్‌లకు కూడా హాజరు కావాల్సి ఉందన్నారు. దీంతో పరీక్ష ప్రిపేర్‌కు అవకాశం ఉండదన్నారు. దీన్ని దృష్టిలో పెటుకొని పరీక్షను వాయిదా వేయాలని కోరారు. ఇటీవలే ఏపీపీఎస్సీ వారు కూడా ఎన్నికల కారణంగా వివిధ ఉద్యోగ పరీక్షలను కూడా వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారని ఆయన తెలిపారు.

ఇద్దరు వలంటీర్ల సస్పెన్షన్

పీలేరు, మార్చి 19: వైసీపీ నాయకులతో కలిసి ఎన్నికల ప్రచారంలో పాల్గొని నిబంధనలు ఉల్లంఘించిన ఇద్దరు వలంటీర్లను సస్పెండ్ చేసినట్లు పీలేరు ఎంపీడీవో కె.ఉపేంద్ర రెడ్డి తెలిపారు. అధికార పార్టీ నేతల వెంట వలంటీర్లు ఎన్నికల ప్రచారం చేస్తున్న విషయం 'ఎన్నికల ప్రచారంలో వలంటీర్లు' అన్న శీర్షికన మంగళవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన విషయం పాఠకులకు విధితమే. ఈ అంశంపై దృష్టి సారించిన ఎంపీడీవో, అగ్రహారం పంచాయతీకి చెంది వలంటీర్లు సాయి, సతీశ్, పీలేరు పట్టణానికి చెందిన వలంటీరు అజ్మత్ బాషా వ్యవహారంపై విచారణ జరిపారు. అగ్రహారం గ్రామంలో 18వ తేదీ రాత్రి జరిగిన అధికార పార్టీ నేతల ఎన్నికల ప్రచారంలో వారు పాల్గొన్నట్లు నిర్ధారణ కావడంతో వారిద్దరినీ సస్పెండ్ చేశారు. అయితే అజ్మత్‌బాషా భార్య ఆయేషా వలంటీరుగా ఉందని, ఆమె స్థానంలో అజ్మత్ విధులు నిర్వహిస్తున్నాడన్న విషయం తేలిందని, ఆ విషయాన్ని జిల్లా ఉన్నతాధికారులతో పాటు పీలేరు ఆర్‌వోకు నివేదించినట్లు ఎంపీడీవో తెలిపారు.

వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి రాచమల్లు ప్రచారం చేస్తున్న దృశ్యం



ప్రచారంలో పాల్గొన్న ఎమ్మెల్యే సతీమణి రమాదేవి, వార్డు కౌన్సిలర్ పల్లా రమాదేవి





నాటక అకాడమీ డైరెక్టర్ కారుకు సిద్ధం స్టిక్కర్లు వున్న దృశ్యం



దేవాంగ కార్పొరేషన్ డైరెక్టర్ వాహనానికి జగన్ బొమ్మతో వున్న సిద్ధం స్టిక్కరు

యథేచ్ఛగా వైసీపీ కోడ్ ఉల్లంఘనలు

- అనుమతులు లేకుండా ఎన్నికల ప్రచారం
- నేతల వాహనాలకు తొలగించని వైసీపీ స్టిక్కర్లు
- అనుమతిలేదని వైసీపీ ఎన్నికల ప్రచారాన్ని అడ్డుకున్న కోడ్ అధికారులు
- కౌన్సిల్లరు, ఆమె కుమారుడిపై కోడ్ ఉల్లంఘన కేసు నమోదు
- వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి రాచమల్లుపై కేసు నమోదు చేయని అధికారులు


వైసీపీ ప్రచారంలో వాలంటీర్ గోపిరెడ్డి ధనుంజయ్ పాల్గొన్న దృశ్యం, (ఇన్‌సెట్‌లో) అనుమతి లేదని ప్రచారం నిలిపివేయమని రాచమల్లును కోరుతున్న ఫ్లైయింగ్ స్క్వాడ్ టీం హైమావతి

ప్రొద్దుటూరు, మార్చి 19: దేశవ్యాప్తంగా సార్వత్రిక ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చి నాలుగు రోజులు కావస్తోంది. జాతీయ ఎన్నికల కమిషన్ ఎన్నికల షెడ్యూల్ విడుదల చేసినప్పటి నుండే ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఎంసీసీ (మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్) అమలులోకి వస్తుందని ప్రకటించింది. అప్పటి నుంచి 24 గంటల సమయంలో ఎన్నికల ప్రచారానికి సంబంధించి ఫ్లెక్సీలు, బ్యానర్లు, బోర్డులు ఇతర ప్రచార సామాగ్రి ఏవి వుండకుండా తొల గించే పనులు చేపట్టాలని ఆదేశించింది. అంతేకాకుండా ఏ రాజకీయ పార్టీ అయినా సమావేశాలు పెట్టుకోవాలన్నా.. ఎన్నికల ప్రచారం నిర్వహించుకోవాలన్నా ఆ నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి అనుమతులు పొందాల్సి వుంటుంది. ఎన్నికల షెడ్యూల్ రాకతో గత వైసీపీ ప్రభుత్వం గడువు తీరిపోయింది. ముఖ్యమంత్రి సైతం అపద్దర్మంగా వుంటారు. కానీ వైసీపీ వారికి ఇంకా తమ ప్రభుత్వం వున్నట్లే భావిస్తూ వ్యవహరిస్తున్నారు. ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చినా వారికి ఇవేమి లేక్కలేనట్లు నడుచుకుంటున్నారు.

ప్రొద్దుటూరులో వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి రాచమల్లు ప్రసాద్‌రెడ్డి తాను ఇంకా ఎమ్మెల్యేగానే భావిస్తూ తన అధికార దర్పాన్ని చాటుతున్నారు. ఆదివారం తన సొంత స్థలంలో దూదేకుల ఆత్మీయ సభ పేర ఎన్నికల నియమావళికి విరుద్ధంగా ఒక కులం ఓట్లను ప్రభావితం చేసేలా కార్యక్రమం చేపట్టారు. కోడ్ వచ్చినా ఆ కార్యక్రమానికి ఎన్నికల అధికారి నుంచి అనుమతి తీసుకోకుండా సభ జరిపారు. వచ్చిన మహిళలు చీరలు ఇస్తామని చెప్పి టోకన్లు ఇచ్చి అక్కడ మీడియా ఎదుట పంచకుండా ఇంటికి తెచ్చిస్తామని చెప్పి వెళ్లిపోయారు. ఈ సంఘటనపై ఆంధ్రజ్యోతిలో కథనం రావడంతో కేవలం ఇద్దరు దూదేకుల నాయకులపై కేసు పెట్టి అధికారులు చేతులు దులుపకున్నారు. వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి తనకు ఓట్లు వేయించుకోవడానికి కులపరమైన ఓటర్లతో సమావేశపరిచి వారిని ప్రలోభపెట్టి ఓట్లడిగితే ఆయనపై కేసులు పెట్టకుండా నిర్వాహకులపై కేసు పెట్టి అధికార వైసీపీ పెద్దలకు ఎన్నికల అధికారులు మద్దతు తెలిపినట్లయింది.

మున్సిపాలిటీలోని 38వ వార్డులో మంగళవారం కూడా వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి రాచమల్లు ప్రసాద్‌రెడ్డి ఆయన సతీమణి రాచమల్లు రమాదేవితో సహా వందలాది మంది వైసీపీ నాయకులు, కార్యకర్తలతో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ ఎన్నికల ప్రచారానికి కూడా ప్రొద్దుటూరు ఎన్నికల రిటర్నింగ్ అధికారితో ఎటువంటి ప్రచార అనుమతి తీసుకోలేదు. అంతేకాకుండా వైసీపీ నాయకుల వాహనాలకు జగన్ బొమ్మ ఉన్న సిద్ధం స్టిక్కర్లు తొలగించకుండానే ప్రచారంలో తిరుగుతున్నారు. మరోవైపు వాలంటీర్లు కూడా ప్రచారంలో కార్యకర్తల్లా పాల్గొంటున్నారు. ఎన్నికల కమిషన్ తీవ్రంగా హెచ్చరించినా ప్రచారంలో వెనక్కుతగ్గడం లేదు.

అనుమతి లేకుండా వైసీపీ అభ్యర్థి రాచమల్లు ప్రచారం చేస్తున్న సంగతి జిల్లా ఎన్నికల అధికారి, ప్రొద్దుటూరు ఎన్నికల రిటర్నింగ్ అధికారి దృష్టికి వెళ్లింది. వారు ఎంసీసీ నోడల్ అధికారి, మున్సిపల్ కమిషనర్ రఘునాథ్‌రెడ్డికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దీంతో ఎంసీసీ ఫ్లయింగ్ స్క్వాడ్ టీం లీడర్, ఐసీడీఎస్ సీడీపీవో హైమావతి, వీఆర్‌వో శ్రీనాథ్, పోలీసు కానిస్టేబుల్ లక్ష్మిరెడ్డిలు 38వ వార్డులోని సాయిరాంనగర్‌కు చేరుకుని వైసీపీ అభ్యర్థి రాచమల్లు ప్రసాద్‌రెడ్డితో మీ ప్రచారానికి అనుమతి లేదని.. నిలిపి వేయాలని కోరారు. అందుకు రాచమల్లు పట్టించుకోకుండా వెళ్లారు. కానీ రెండవసారి మళ్లీ ఆమె వెళ్లి మీరు ప్రచారం నిలపకుంటే కేసు నమోదవుతుందని హెచ్చరించడంతో ఆయన ప్రచారం నిలిపి వేశారు. అప్పటికే ప్రచారం ముగిసేదశలో వుండటంతో అక్కడి నుంచి వెళ్లిపోయారు. కానీ ఎన్నికల కోడ్ అధికారులు మళ్లీ రాచమల్లుపై కోడ్ ఉల్లంఘన కేసు పెట్టకుండా ఆ వార్డు కౌన్సిలర్ పల్లా రమాదేవి ఆమె కుమారుడు పల్లా సురేష్‌లపై కేసు నమోదు చేశారు. ఎన్నికలు ఎమ్మెల్యేవి. ప్రచారం ఆయనకు ఓటేయ్యమని ఆయనే స్వయంగా కోడ్ ఉల్లంఘించి ప్రచారం చేస్తే ఆయనపై ఎన్నికల అధికారులు కేసు పెట్టకుండా వైసీపీ క్యాడర్‌మీద పెట్ట డంపై ఎన్నికల అదికారుల తీరు విమర్శలకు దారితీస్తోంది.

ఇళ్లకు వెళ్లి చీరల పంపిణీ

ఆదివారం దూదేకుల సభలో పంచని చీరలు మంగళవారం పలు ప్రాంతాల్లో దూదేకులు వున్న వారి ఇళ్లకు వెళ్లి వైసీపీ కార్యకర్తలు పంపిణీ చేశారు. దీన్ని బట్టి ప్రొద్దుటూరులో ఎక్కడా ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలు కావడం లేదు. మీడియా మాత్రమే కోడ్ ఉల్లంఘనలకు సంబంధించి వార్తా కథనాలు, ప్రసారాలు చేస్తుంటే అధికారులు తాపీగా వచ్చి విచారించి.. నామమాత్రం కేసులు నమోదు చేస్తున్నట్లు ఆరోపణలు వున్నాయి ఎన్నికల కోడ్ అమలు చేయడానికి వున్న సిబ్బందిని ఇందులో ఎక్కడా బాధ్యులను చేసి చర్యలు తీసుకోక పోవడంతో ఈ కోడ్ ఉల్లంఘనల పరంపర కొనసాగుతునే వుంది. పైకి 24 గంటలు ఫ్లయింగ్ స్క్వాడ్ టీంటు పర్యవేక్షిస్తున్నాయని అధికారులు ప్రకటించడం తప్ప వారు కాన రావడం లేదనే ఆరోపణలున్నాయి. ఇప్పటికైనా జిల్లా ఎన్నికల అధికారులు ప్రొద్దుటూరులో ఎన్నికల ప్రవర్తనా నియమావళిని అమలు చేయడంలో కఠినంగా వ్యవహరించాలని ప్రజలు కోరుతున్నారు.

మైదుకూరులో వైసీపీ కోడ్ ఉల్లంఘన

మైదుకూరు, మార్చి 19: ఎన్నికల కోడ్ అమలులో ఉంటే మాకేంటి... మాకెవరు అడ్డు చెప్పే వారు.. అన్నట్లు వైసీపీ నేతలు వ్యవహరిస్తున్నారు. మంగళవారం మైదుకూరులోని ఓ కల్యాణ మండపంలో ఎంపీ అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్యే రఘురామిరెడ్డి ఇతర నాయకుల సమక్షంలో ఓ నాయకుడు వైసీపీలోకి చేరేందుకు కార్యక్రమం ఏర్పాటు చేసుకున్నారు. ఎన్నికల కోడ్ అమలులో అమలులో ఉన్నా పార్టీలో చేరనున్న ఆ నాయకుడు కారులో డీజే సౌండ్‌తో ర్యాలీగా మైదుకూరుకు వెళ్లారు. దీంతో పట్టణంలో వాహనాల రాకపోకలు ఆగిపోయి ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడి ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ఈ విష యం ఎన్నికల అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో అసిస్టెంట్ ఆర్వో నరేంద్రనాథరెడ్డి వివరణ ఇచ్చారు. కోడ్ ఉల్లంఘనపై ప్రత్యేక నిఘా బృందాలు పెట్టామని, ఫిర్యాదు వస్తే తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.


జాతీయ రహదారిపై అడ్డదిడ్డంగా వాహనాలు

సమయం లేదు.. మిత్రమా..!



- ఖాళీ స్థలముంటే కబ్జా చేద్దాం.. అమ్మేద్దాం
- రూ.50 కోట్ల విలువ చేసే ప్రభుత్వ స్థలం కబ్జా
- చదను చేసి వెంచర్ వేసే యత్నం
- ఇప్పటికే అక్కడ సెంటు రూ.10 లక్షల నుంచి 18 లక్షలు
- తెర వెనుక వైసీపీ నేతలు

(కడప - ఆంధ్రజ్యోతి): దీపం ఉండగానే ఇల్లు చక్కదిద్దాలనుకున్న నానుడిని వైసీపీ నేత లు కొందరు బాగా వంటబట్టించుకున్నారు. అధికారం అడ్డు పెట్టుకుని కబ్జాలు, సెటిల్ మెంట్లు చేసి అడ్డంగా సంపాదించుకున్నారు. ఇక ఎన్నికల షెడ్యూలు రావడంతో సమ యం లేదు మిత్రమా... ఖాళీ స్థలం ఉంటే చదను చేసేయ్, కబ్జా చేసెయ్, అమ్మేసుకో.. అనే ధోరణలో ఖాళీ స్థలాలపై పడ్డారు. ఎన్నికల షెడ్యూలు రావడంతో అధికారులంతా ఆ పనిలో బిజీగా ఉన్నారు. రాజకీయ పార్టీ నాయకులు ఓట్ల కోసం ప్రచారంలో తలమునకలై ఉన్నారు. ఇదే అదనుగా భావించి ఏకంగా రూ.50 కోట్లు విలువ చేసే స్థలానికి టెండరు పెట్టడం గమనార్హం. దీని వెనుక వైసీపీ ముఖ్యనేత ఉన్నట్లు చెబుతున్నారు. ఇప్పుడీ వ్యవహారం హాట్‌టాపిక్‌గా మారింది.

కడప నగరం నలుదిక్కులా విస్తరిస్తోంది. ఎర్రముక్కపల్లె సర్కిల్ నుంచి రైల్వేగేటు మీదుగా సాయి ప్రతాప్‌కాలనీ నుంచి అటు రింగు రోడ్డు ఫ్లైఓవరు, ఇటు అంగడివీధి నుంచి తెలుగుగంగ ఏరియాకు వెళ్లే ప్రాంతం బాగా విస్తరించింది. ఇక్కడ పెద్ద పెద్ద వెంచర్లు వెలుస్తున్నాయి. ప్రాంతాన్ని బట్టి ఇక్కడ సెంటు స్థలం రూ.8లక్షల నుంచి 18 లక్షల మేర ధర ఉందంటారు. సీకేదిన్నె మండలంలోని రెవెన్యూ సర్వే నెం.235/2లో 42.75 ఎకరాల బుగ్గవంక భూమి ఉంది. ఆర్ఎస్ఆర్ ఇతర రెవెన్యూ రికార్డుల్లో 36.94 ఎకరాలు ఉంది. అయితే దీని పరిధిలోనే వెంచర్లు ఉన్నాయి. అక్కడ సెంటు రూ.10 నుంచి 15 లక్షల మధ్య అమ్మకాలు సాగాయి. ఇప్పుడు ఇక్కడ ఐదు ఎకరాలు కబ్జా చేసేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు. సెంటు 10 లక్షలు వేసుకున్న కూడా ఈభూమి విలువ రూ.50కోట్లు అవుతుంది. ఈ పరిధిలోనే రైల్వేకు సంబంధించి వాటర్ ట్యాంకు ఉండేదని చెబుతారు. దాన్ని కూడా పగలగొట్టి చదను చేసినట్లు చెబుతారు.

వామ్మో వైసీపీ నేతలు

గత ప్రభుత్వాల్లో ఎన్నడూ లేని విధంగా కబ్జాలు జగన్ సర్కారు హయాంలోనే సాగాయి. కోట్లు విలువ చేసే ప్రభుత్వ స్థలాలను కొంతమంది వైసీపీ ముఠా కాజేసింది. అవకాశం ఉంటే గాలి ఆకాశాన్ని కూడా మింగే ఘనులు వైసీపీ బ్యాచ్‌లో ఉండారంటారు. ఇంత విలువైన రూ.50కోట్లు విలువ చేసే బుగ్గవంక భూమిని కాజేయడం తీవ్ర దుమారం రేపుతుంది. ఈ విషయమై ఆంధ్రజ్యోతి సీకేదిన్నె తహసీల్దారు భాగ్యలక్షుమ్మను వివరణ కోరగా సర్వే చేసి హద్దులు నిర్ణయిస్తామన్నారు.

కడపలో పేట్రేగిపోతున్న భూమాఫియా

గత ఐదు సంవత్సరాల కాలంలో కడప నగరం చుట్టుపక్కల ప్రాంతాల్లో భూ మాఫియా పేట్రేగిపోతోందని అఖిలపక్ష నాయకులు మండిపడ్డారు. నగర సరిహద్దు ప్రాంతమైన సీకేదిన్నె మండల ప్రాంతంలో సర్వే నెంబరు 235/2లో ఉన్న దాదాపు 42.75 ఎకరాల భూమిని పరిశీలించారు. ఈ సందర్భంగా అఖిలపక్ష ఐక్యవేదిక కన్వీనరు కారు ఆంజనేయులు మాట్లాడుతూ కడపలో ఉన్న భూకబ్జాలకు హద్దు అదుపు లేకుండాపోయిందన్నారు. ప్రభుత్వ భూమి ఖాళీగా కనబడితే గద్దల్లాగా వాలిపోయి ప్రభుత్వ అధికారులను మేనేజ్ చేసుకుని భూదందాలు కొనసాగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికార బలంతో కోట్ల రూపాయలు విలువైన భూములను తప్పుడు డాక్యుమెంట్లతో సృష్టించి సొంతం చేసుకుంటున్నారని ఆరోపించారు. కడప నగర డిప్యూటీ మేయరు అండదండలతోనే ఈ కబ్జా జరిగినట్లు మా దృష్టికి వచ్చిందని...త్వరలోనే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని తెలిపారు.


అక్రమణకు గురి కానున్న ప్రభుత్వ భూమి

రేపు, ఎల్లుండి నారా భువనేశ్వరి పర్యటన



(కడప- ఆంధ్రజ్యోతి): టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టును జీర్ణించుకోలేక పలువురు టీడీపీ నేతలు మృతి చెందారు. అయితే కుటుంబ పెద్ద చనిపోవడంతో ఆయా కుటుంబాలన్నీ రోడ్డున పడ్డాయి. ఆ కుటుంబాలను తెలుగుదేశం పార్టీ ముఖ్యంగా నారా, నందమూరి కుటుంబ సభ్యులుగా సొంతం చేసుకున్నారు. బాధిత కుటుంబాలను తమ వంతుగా ఆదుకునేందుకు దివంగత ఎన్టీఆర్ కుమార్తె, మాజీ సీఎం చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి రాష్ట్రవ్యాప్తంగా పర్యటిస్తున్నారు. ఇందులో భాగంగా కడప జిల్లాలో పర్యటిస్తున్నారు. గురువారం సాయంత్రం 6గంటలకు పోరుమామిళ్లలో కొత్తవీధి, బలిజకోటలో బాధితులను పరామర్శించనున్నారు. అనంతరం బద్వేలు చేరుకుని ఆర్ఆర్ కన్వెన్షన్‌లో బస చేస్తారు. ఇక శుక్రవారం ఉదయం 10గంటలకు ఆర్ఆర్ కన్వెన్షన్ నుంచి బయల్దేరి 10.45కు బికోడూరు మండలంలోని గుంతపల్లె చేరుకుంటారు. అక్కడ బాధితులను ఓదార్చుతారు. అనంతరం 11.45 గంలకు కలసపాడు మండలంలోని లింగారెడ్డిపల్లె వెళతారు. అక్కడ భరోసా ఇచ్చి 12.30కు బ్రాహ్మణపల్లె వెళతారు. ఆ తరువాత అక్కడ నుంచి మధ్యాహ్నం 1.15కు తెల్లపాడు చేరుకుని బాధితులను పరామర్శించి వారికి భరోసా ఇస్తారు.

సమాజంలో ఎన్జీవోల పాత్ర కీలకం

సీనియర్ సివిల్ జడ్జి బాబాపక్రుద్దీన్



మాట్లాడుతున్న జడ్జి బాబా పక్రుద్దీన్

కడప(రూరల్) మార్చి 19 : సమాజంలో ఎన్జీవోల పాత్ర కీలకమని, ఈ మేరకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులకు అందేలా ఎన్జీవోలు అవగాహన కల్పించాలని డీఎల్ఎస్ఏ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి బాబాపక్రుద్దీన్ తెలిపారు. బుధవారం జిల్లా కోర్టు ఆవరణంలోని న్యాయసేవా సదన్‌లో ఎన్జీవోలకు సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ ఎన్జీవోలు అన్ని వర్గాలకు అవేర్‌నెస్ కలిగించి ప్రభుత్వ పథకాలు అందేలా చూడాలన్నారు. లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సిస్టం గురించి వివరించారు. ఉచిత న్యాయసహాయం, లోకాయుక్త గురించి తెలియపరిచారు. ఎన్జీవోల యాక్టివిటీస్ గురించి అడిగి తెలుసుకున్నారు.

కడపలో భూకబ్జాలకు అడ్డే లేదు

పేట్రేగిపోతున్న వైసీపీ నాయకులు : అఖిలపక్ష నేతల వెల్లడి



వెంచర్లను పరిశీలిస్తున్న అఖిలపక్ష నేతలు

కడప (సెవెన్‌రోడ్స్), మార్చి 19 : ఐదేళ్ల కాలంలో కడప నగరం చుట్టుపక్కల ప్రాంతాల్లో భూమాఫియా పేట్రేగిపోయిందని అఖిల పక్ష నాయకులు మండిపడ్డారు. నగర సరిహద్దు ప్రాంతమైన సీకేదిన్నె మండల ప్రాంతంలో సర్వే నెం.253/2లో ఉన్న దాదాపు 42.75 ఎకరాల భూమిని పరిశీలించారు. ఈ సందర్భంగా అఖిల పక్ష ఐక్యవేదిక కన్వీనర్ కారు ఆంజనేయులు మాట్లాడుతూ కడపలో ఉన్న భూకబ్జాలకు అడ్డూఅదుపు లేకుండాపోయిందన్నారు. ప్రభుత్వ భూమి ఎక్కడ ఖాళీగా కనపడితే అక్కడ గద్దల్లాగా వాలిపోయి ఆక్రమించుకుంటున్నారన్నారు. ఇది ఒక పెద్ద ముఠాలా తయారైందని, డిప్యూటీ మేయర్ అండదండలతోనే ఈ కబ్జా జరుగుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. త్వరలో ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసి భూకబ్జాలకు వ్యతిరేకంగా ఆందోళనా కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో అఖిల పక్ష రాజకీయ ప్రజా సంఘాల నాయకులు చేతివృత్తుల జాతీయ కన్వీనరు అవ్వారు మల్లికార్జున, రైతు స్వరాజ్య వేదిక పుత్తా శివారెడ్డి, దళిత మిత్ర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కైపు రామాంజనేయులు, లోక్‌సత్తా పార్టీ జిల్లా కన్వీనరు దేవరక్రిష్ణ, హేతువాద సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సీఆర్వీ ప్రసాద్, విద్యార్థి యువజన నాయకుడు డీఎం ఓబులేసు, గ్రేటర్ రాయలసీమ అభివృద్ధి వేదిక జిల్లా కన్వీనర్ బందెల ఓబయ్య, నగర క న్వీనర్ షాజహాన్, కో-కన్వీనర్ ఆలీబాబా పాల్గొన్నారు.

400 లీటర్ల సారా ఊట ధ్వంసం

సుండుపల్లె, మార్చి19: మండలంలోని భాగంపల్లె గ్రామ పంచాయతీ కుప్పగుట్ట గ్రామ పరిధిలో 400 లీటర్లసారాయి ఊటను ధ్వంసం చేసినట్లు ఎస్ఐ ఎస్‌కేఎం హుస్సేన్ మంగళ వారం తెలిపారు. సారాయి బట్టీలను ఏర్పాటు చేస్తే సహించేది లేదని, అలా చేసిన వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. మత్తు పానీయాలు మానవ జీవితాన్ని నాశనం చేస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ బీడీ నాయక్, కానిస్టేబుల్ బీవీఎన్ రాజు, మోహన్, పోలీసు సిబ్బంది, హోంగార్డులు పాల్గొన్నారు.

భార్య హత్య కేసులో భర్తకు రిమాండ్



నిందితుడి అరెస్టు చూపుతున్న పోలీసులు

లక్కిరెడ్డిపల్లె మార్చి 19: భార్యను హత్య చేసిన కేసులో భర్తను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ జీవన్‌రెడ్డి తెలిపారు. మండలంలోని కుర్నూతల పంచాయతీ బమ్మేపల్లె గ్రామానికి చెందిన రమణమ్మ ప్రవర్తన సరిగా లేకపోవడంతో తానే ఆమెను హత్య చేసినట్లు నిందితుడు యోగానందరెడ్డి ఒప్పుకున్నట్లు సీఐ వివరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ విష్ణువర్ధన్‌రెడ్డి హెడ్ కానిస్టేబుల్ రామ్‌ప్రసాదు సిబ్బంది పాల్గొన్నారు

బ్రహ్మోత్సవాలకు ముమ్మర ఏర్పాట్లు



ఒంటిమిట్ట, మార్చి 19 : కోదండరాముడి బ్రహ్మోత్సవాలకు టీటీడీ ఆధ్వర్యంలో ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఏప్రిల్ 16 నుంచి ప్రారంభం కానున్న బ్రహ్మోత్సవాల నేపథ్యంలో టీటీడీ ఇంజనీరింగ్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేపట్టారు. కోదండరామాలయ ప్రాంగణంలో రహదారులు, మాడవీధులను పెయింటింగ్ కార్యక్రమాలను చురుగ్గా చేపట్టారు. మాడవీధుల్లో చలువపందిళ్లు, భక్తులకు ఏర్పాటు చేసి అన్నదానం, శానిటరీ వంటి వాటిపై ముందస్తుగా చర్యలు చేపట్టారు. కల్యాణ వేదిక ప్రాంతంలో నూతన మరుగుదొడ్లు ఏర్పాటు చేయడం, తాగునీటి కోసం ప్రత్యేక ఫ్లైఓవర్ ట్యాంక్, కల్యాణ వేదిక ప్రాంతమంతా భక్తుల కోసం ప్రత్యేకంగా బండలు ఏర్పాటు చేశారు. వీటితో పాటు గ్రీనరీ రోడ్లు వంటి వాటిని ముమ్మరంగా చేపట్టారు. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకొని భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లను టీటీడీ అధికారులు చేపట్టారు.

ప్రమాద రహిత డ్రైవర్లుగా మన్ననలు పొందాలి

శిక్షణా తరగతులలో ఆర్టీసీ ఆర్ఎం గోపాల్‌రెడ్డి

కడప (మారుతీనగర్), మార్చి 19: ప్రమాద రహిత డ్రైవర్లుగా ఆర్టీసీలో సేవలందించి అధికారుల మన్ననలు అందుకోవాలని ఆర్టీసీ కడప రీజనల్ మేనేజర్ పొలిమేర గోపాల్‌రెడ్డి డ్రైవర్లకు సూచించారు. మంగళవారం స్థానిక ఆర్ఎం కార్యాలయ సమావేశ మందిరంలో యాక్సిడెంట్స్, డ్రంకన్, ర్యాష్ డ్రైవింగ్ చేసిన వారికి ప్రత్యేక శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బస్సు నడిపే సమయంలో డ్రైవర్ మానసిక ఒత్తిడితో ఉండరాదన్నారు. అనంతరం ఆర్టీసీ డిప్యూటీ సీఎంఈ లక్ష్మీభాస్కర్ మాట్లాడుతూ పంచ సూత్రాలు పాటించి డ్రైవింగ్ చేయడం వల్ల ఇంధనాన్ని పొదుపు చేయడంతో పాటు ప్రమాదాలను నివారించగలమన్నారు.

ఎల్ఎల్‌బీ పరీక్షల తేదీల్లో మార్పు

కడప (ఎడ్యుకేషన్), మార్చి 19: వైవీయూ పరిధిలో ఈనెల 23న జరగాల్సిన 3, 5 ఏళ్ల లా పరీక్షలను 24వ తేదీకి వాయిదా వేసినట్లు పరీక్షల నియంత్రణ అధికారి ప్రొఫెసర్ ఈశ్వర్‌రెడ్డి తెలిపారు. కొన్ని సాంకేతిక కారణాల దృష్ట్యా ఈ మార్పు చేశామని విద్యార్థులు గమనించాలన్నారు. మిగలిన పరీక్షలు యదావిధంగా జరుగుతాయన్నారు.

గాలివీడులో బీళ్లుగా ఉన్న భూములు



నీరు లేక ఎండిపోయిన నూలివీడు పంచాయతీ నక్కలవాడపల్లెలోని మెరగల చెరువు



రైతుల ఆశలు ఆవిరి

- రైతులను నట్టేట ముంచిన ఖరీఫ్, రబీ సీజన్‌లు
- ఎడారిగా మారిన వ్యవసాయ భూములు
- రాయచోటి నియోజకవర్గ వ్యాప్తంగా లక్ష ఎకరాల్లో పంటల సాగు ప్రశ్నార్థకం

గాలివీడు, మార్చి 19: ఒకప్పుడు పంట పొలాలతో కళకళలాడే భూములు నేడు వర్షాలు లేక ఎడారిని తలపిస్తున్నాయి. ఖరీఫ్‌పై ఎంతో ఆశలు పెట్టుకున్న రైతుల ఆశలు ఆడియాశలు కాగా రబీలో కూడా వరుణదేవుడు కరుణించకుండా ముఖం చాటేశాడు. దీంతో రాయచోటి నియోజకవర్గ వ్యాప్తంగా లక్ష ఎకరాలకు పైబడి సాగు భూమి బీడువారి ఎడారిని తలపిస్తోంది. చేసేదేమీ లేక రైతులు పొట్టకూటి కోసం పట్టణాలకు తరలివెళ్లే పరిస్థితులు నెలకొంటున్నాయి. రాయచోటి నియోజకవర్గ వ్యాప్తంగా కరువు ఛాయలు అలుముకున్నాయి. నియోజకవర్గంలోని మొత్తం జనాభాలో మూడొంతుల మంది వ్యవసాయం దాని అనుబంధ రంగాలపై ఆధారపడి జీవిస్తున్నారు. ఈ ప్రాంతంలో వరి, వేరుశనగతో పాటు కూరగాయలు, ఆకుకూరలు సాగు చేస్తున్నారు. ఈ ప్రాంత భౌగోళిక పరిస్థితుల దృష్ట్యా వేరుశనగ సాగుకు అనుకూలమైన భూములు, వాతావరణ పరిస్థితులు ఉన్నాయని, చెరువు, బావుల కింద వరిని సాగు భూమితో పాటు ఇటీవల బోరుబావుల కింద కాయకూరలు, ఆకుకూరలను సాగు చేస్తున్నారు. వీటితో పాటు పండ్ల తోటల్లో ఒకటైన మామిడిని విస్తృతంగా పెంచుతున్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా 50 వేల ఎకరాలకు పైబడి వేరుశనగ, 30 వేల ఎకరాలకు పైబడి వరి, 10 వేల ఎకరాలకు పైబడి మామిడి, మిగతా భూమిలో ఇతర పంటలను సాగు చేస్తున్నారు.

నిరాశపరచిన రుతుపవనాలు

సాధారణంగా జూన్‌లో ప్రారంభమయ్యే నైరుతి రుతుపవనాలు (ఖరీఫ్ సీజన్) కాలంలో వర్షాలు సక్రమంగా కురిస్తే అధిక విస్తీర్ణంలో వేరుశనగను సాగు చేసేవారు. కానీ ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో వర్షాలు పడకపోవడం వలన వేరుశనగ సాగు గణనీయంగా తగ్గిపోయింది. కనీసం 10 వేల ఎకరాలు కూడా సక్రమంగా వేరుశనగను సాగు చేసిన దాఖలాలు కనపడలేదు. అదే గత సంవత్సరం ఖరీఫ్ సీజన్‌లో 40 వేల ఎకరాలకు పైబడి వేరుశనగను సాగు చేసేవారు. ఈ ఏడాది ఖరీఫ్‌లో వరి నామమాత్రంగా కూడా సాగు చేయకపోవడం గమనార్హం. కనీసం ఈశాన్య రుతుపవన కాలంలోనైనా (రబీ సీజన్) తుఫానుల ప్రభావంతో అధిక వర్షాలు కురుస్తాయి. అనుకుంటే వరుణదేవుడు కరుణించలేదు. సాధారణంగా ప్రతి ఏడాది అక్టోబరు, నవంబరు నెలల్లో బంగాళాఖాతంలో ఏర్పడే తుఫానుల వల్ల రాయచోటి నియోజకవర్గ వ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురిసేవి. కానీ ఈ ఏడాది కనీసం ఒక్క తుఫాను ప్రభావం కూడా ఈ ప్రాంతం మీద పడలేదు. గత కొన్ని సంవత్సరాలుగా ఈ సీజన్‌లో మాత్రమే ఈ ప్రాంతంలో వరిని ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేసేవారు. కానీ నేడు రబీ సీజన్‌లో వరి కనుమరుగైంది. ఖరీఫ్, రబీ రెండు సీజన్లలో వరుణదేవుడు కరుణించకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కనీసం తిండి గింజలు పండించుకోవడానికైనా వర్షం కురవలేదని ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే జీవనం ఎలా సాగించాలని రైతులు ఆందోళన చెందుతున్నారు. 30 సంవత్సరాల కాలంలో అక్టోబరు, నవంబరు నెలల్లో తుఫానులు లేకపోవడం గతేడాదేనని ఇలాంటి సంవత్సరాన్ని ఎన్నడూ చూడలేదని రైతులు తమ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే అందరూ ప్రజలను పల్లెలను వదిలి పట్టణాలకు పోవాల్సిన పరిస్థితులు ఏర్పడతాయి. తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్న దృష్ట్యా ఇప్పుడే ఇలాంటి దుర్భర పరిస్థితులు ఉంటే ఇక అధికంగా ఎండలు ఉండే ఏప్రిల్, మే నెలల్లో ఎలాంటి పరిస్థితులు ఉంటాయోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ ఏడాది ఎండాకాలం మామిడి చెట్లను కాపాడుకోవడం తలకు మించిన భారం అవుతుందని రైతులు వాపోతున్నారు.

30 సంవత్సరాలుగా ఇలాంటి పరిస్థితులు చూడలేదు..



నా వయస్సు 60 సంవత్సరాలు. నాకు తెలిసినంత వరకు గత 30 సంవత్సరాలుగా రబీ సీజన్‌లో ఇలాంటి తీవ్ర వర్షాభావ పరిస్థితులు చూడలేదు. ప్రతి సంవత్సరం అక్టోబరు, నవంబరు నెలల్లో కనీసం సగం చెరువులు నిండేవి. గత ఏడాది నెలకు ఒక పదును కూడా సక్రమంగా కాలేదు. ఇదే పరిస్థితి కొనసాగితే పల్లె సీమలు అన్నీ ఖాళీ అయిపోయే పరిస్థితులు నెలకొంటాయి.

-పెద్దు రెడ్డెప్పరెడ్డి, నూలివీడు, రైతు

గణనీయంగా తగ్గిన పంటల సాగు..



మాకు 15 ఎకరాలు మెట్ట, మాగాణి కలదు. ప్రతి సంవత్సరం ఖరీఫ్‌లో మెట్ట భూమిలో వేరుశనగ, రబీ సీజన్‌లో మాగాణిలో వరి సాగు చేసే వాళ్లము. కానీ ఈ ఏడాది 3 ఎకరాల్లో వేరుశనగను కూడా సాగు చేయలేకపోయాము. వరిని సాగు చేయాలన్న ఆలోచన కూడా లేదు. ఎందుకంటే వర్షాలు లేకపోవడమే.

- ఈశ్వర్‌రెడ్డి, రైతు, సీసీపల్లె

మామిడి తోటలను కాపాడుకోవడం కష్టమే..



ఈ ఏడాది తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. చెరువుల్లో, బావుల్లో ఇప్పటికే చుక్కనీరు లేకుండాపోయింది. బోరు బావులు కూడా ఏప్రిల్, మే నెలల్లో ఎండిపోయే పరిస్థితులు ఉన్నాయి. బోరుబావులు అడుగంటిపోతే మామిడి చెట్లు వాడిపోతాయి. కొన్ని సంవత్సరాలుగా సాకిన చెట్లు కళ్ల ముందే ఎండిపోతే ఆ బాధను భరించలేదు.

- పిచ్చయ్య, పూలుకుంట

పంప్‌హౌస్‌ల వద్ద ఎక్స్‌కవేటర్‌తో మట్టి తొలగింపు





ఎక్స్‌కవేటర్‌తో పంప్‌హౌస్ వద్ద పనులు చేస్తున్న దృశ్యం, ఎమర్జెన్సీ రంధ్రం ద్వారా పంప్‌హౌస్‌లలోకి నీరు ఎక్కిస్తున్న దృశ్యం

- ఎమర్జెన్సీ ఉపయోగించిన పంప్‌హౌస్ సిబ్బంది

జమ్మలమడుగు, మార్చి 19: జమ్మలమడుగు నియోజకవర్గంలోని మైలవరం జలాశయంలో మంచినీరు అందించే పంప్‌హౌస్‌ల వద్ద సోమవారం రాత్రి వరకు మట్టిని తొలగించి పనులు చేసినట్లు తెలుస్తోంది. మైలవరం పంప్‌హౌస్‌ల వద్ద మైలవరం, పెద్దముడియం మండలాలకు తరలించే పంప్‌హౌస్ వద్ద ఎమర్జెన్సీ రంధ్రాలను ఉపయోగించేందుకు అడ్డంగా ఉన్న రాళ్లను, మట్టిని తొలగించేందుకు ఇప్పటికే అధికారులు ఆదేశాలు ఇచ్చినట్లు సమాచారం. అలాగే జమ్మలమడుగు మున్సిపాలిటీ అందించే పంప్‌హౌస్ వద్ద ఇదే రకంగా ఆదేశాలిచ్చినట్లుగా సమాచారం. అయితే ప్రొద్దుటూరు, కడప కార్పొరేషన్‌కు నీరు అందించే పంప్‌హౌస్ వద్ద మెగా కన్‌స్ట్రక్షన్‌కు చెందిన కాంట్రాక్టర్లు ఎక్స్‌కవేటర్ ద్వారా జలాశయంలో నుంచి అడ్డంగా ఉన్న మట్టిని, రాళ్లను తొలగించారు. పంప్‌హౌస్ పక్కనే ఎమర్జెన్సీ రంధ్రం ద్వారా పై పట్టణాలకు నీరు అందించేందుకు ఏర్పాట్లు చేసినట్లు సమాచారం. అయితే గండికోట జలాశయం నుంచి మంగళవారం ఉదయానికి కొంతవరకు నీరు విడుదల కావడంతో తాగునీటిని వారం రోజుల పాటు పంప్‌హౌస్‌లోకి మోటార్ల ద్వారా లాగేందుకు ఇబ్బంది ఉండదని తెలిసింది. గండికోట జలాశయం నుంచి అధికారులు 0.3 టీఎంసీలు వచ్చే వరకు రోజుకు 350 నుంచి 500 క్యూసెక్కుల వరకు మైలవరం జలాశయానికి నీటిని విడుదల చేసినట్లు ఇరిగేషన్ శాఖ ఏఈ గౌతమ్‌రెడ్డి తెలిపారు.

గండికోట నుంచి మైలవరానికి నీరు విడుదల

కొండాపురం, మార్చి 19 : గండికోట ప్రాజెక్టు నుంచి మైలవరం జలాశయానికి 500 క్యూసెక్కుల నీరు వదులుతున్నట్లు డీఈ ఉమామహేశ్వర్లు తెలిపారు. కడప పట్టణంలో నీటిఎద్దడి ఉన్నందున ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గండికోట నుంచి మైలవరానికి 0.3 టీఎంసీల నీటిని విడుదల చేయనున్నట్లు ఆయన తెలిపారు. కాగా ప్రస్తుతం గండికోట ప్రాజెక్టులో 5.1 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు డీఈ తెలిపారు.

అన్నదమ్ముల ఘర్షణ

రామాపురం, మార్చి 19: పంపుసెట్టు వంతుల విషయంలో మండలంలోని చిట్లూరు మజ్జిగవాండ్లపల్లెకు చెందిన రామచంద్రారెడ్డి, అమర్‌నాథరెడ్డి వారి కుమారులు ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, పవన్‌కుమార్‌రెడ్డి మంగళవారం ఘర్షణ పడ్డారు. ఘర్షణలో నలుగురికి తీవ్రగాయాలు కాగా, ఇరువురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న ఏఎస్ఐ శ్రీనివాస్‌శర్మ తెలిపారు.

యువకుడిపై కత్తితో దాడి

కడప (క్రైం), మార్చి 19 : కడప నగరం అల్మాస్‌పేట వద్ద సోమవారం రాత్రి ఓ యువకుడిపై ఐదుగురు కత్తితో దాడిచేసి గాయపరిచినట్లు టూటౌన్ పోలీసులు తెలిపారు. పోలీసుల వివరాల మేరకు... అల్మాస్‌పేటకు చెందిన జియావుద్దీన్ సోమవారం రాత్రి ఇంటి సమీపంలో ఉండగా అదే ప్రాంతానికి చెందిన షైనీ, రఖైబ్ అలియాస్ కల్లు, షబ్బీర్, బబ్లు అలియాస్ బాంబేలు మాటామాటా పెరిగి జియావుద్దీన్ వీపుపై కత్తితో పొడిచినట్లు తెలిపారు. చికిత్స నిమిత్తం రిమ్స్‌కు తరలించగా, మెరుగైన చికిత్స కోసం హైదరాబాదుకు తరలించారు. ఐదుగురిపై కేసు నమోదు చేశామని తెలిపారు. కాగా నలుగురిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలుస్తోంది. ప్రధాన నిందితుడు షైనీ పరారీలో ఉన్నట్లు సమాచారం. అతడి కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

ప్రభుత్వ భూమిలో కబ్జాదారుల పాగా



ప్రభుత్వ స్థలంలో ఏర్పాటు చేసిన అక్రమ కట్టడాలను పరిశీలిస్తున్న వీఆర్వో

సిద్దవటం, మార్చి 19 : సిద్దవటం మండలం పెద్దపల్లె రెవెన్యూ బొగ్గిడివారిపల్లె సర్వే నెంబరు 870లోని ప్రభుత్వ భూమిలో కొంతమంది ఎటువంటి అనుమతి లేకుండా రెండు రోజులుగా రాత్రి వేళలో నిర్మాణాలు చేస్తున్నారని స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు. కడప-చెన్నై నేషనల్ హైవే ప్రాంతం ఆనుకొని ఉన్న ప్రభుత్వ స్థలాన్ని రాజకీయ పలుకుబడి, అధికారుల అండదండలతో అక్రమ కట్టడాలు కొనసాగిస్తున్నారని పేద ప్రజలకు రెండు సెంట్లు ఇంటి స్థలం మంజూరు చేయాలన్నా నెలలు తరబడి కార్యాలయం చుట్టూ తిప్పుకుంటున్నారని ఎందుకు చర్యలు చేపట్టడం లేదని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ అధికారులు స్పందించి అక్రమ గురైన ప్రభుత్వ భూమిని స్వాధీనపరుచుకొని అర్హత గల పేదవారికి ఇవ్వాలని తెలియజేశారు. ఈ విషయంపై స్థానిక వీఆర్వో రేణుకను వివరణ కోరగా 870 సర్వే నెంబరుపై ఫిర్యాదు వచ్చిందని వెంటనే అక్కడికి వెళ్లి ఆ స్థలాన్ని పరిశీలించామని ఆ విషయాన్ని తహశీల్దారు దృష్టికి తీసుకెళ్లి చర్యలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. అక్రమ కట్టడందారులు సంబంధిత పత్రాలు తీసుకొని రావాలని తెలిపారు.

యథేచ్ఛగా కోడ్ ఉల్లంఘన!

- సచివాలయం వాట్సాప్ గ్రూపులో వైసీపీ ప్రచారాల జోరు
- పట్టించుకోని ఎన్నికల అధికారులు



సచివాలయం వాట్సప్ గ్రూపులో వైసీపీ ప్రచారం

రైల్వేకోడూరు(రూరల్) మార్చి 19: ఎన్నికల అధికారులు ఎన్నిసార్లు హెచ్చరికలు జారీ చేసినా సచివాలయం సిబ్బంది, వలంటీర్ల తీరు మారడం లేదు. గురుభక్తి కోసం ఏకంగా సామాజిక మాధ్యమాల్లో ఎన్నికల ప్రచారానికి తెరలేపారు. అధికారుల హెచ్చరికలు కూడా బేఖాతరు చేస్తున్నారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడానికి ఏర్పడిన వలంటీర్ల వ్యవస్థ వైసీపీ నాయకులకు ప్రచారాల వ్యవస్థగా మారింది. ఎన్నికల విధులకు వలంటీర్లు దూరంగా ఉండాలని ఎన్నికల అధికారులు తీవ్ర హెచ్చరికలు జారీ చేసినా కోడూరులో ఆ పరిస్థితి కనబడడం లేదు. సచివాలయంలో ప్రతి వలంటీరు లబ్ధిదారులకు సేవలు అందించడం కోసం వాట్సాప్ గ్రూపును ఏర్పాటు చేసుకున్నారు అందులో భాగస్వాములుగా సచివాలయం సిబ్బంది ఉన్నారు. ఎన్నికల కోడ్ అమలు కావడంతో ప్రభుత్వం ఇచ్చిన సిమ్ కార్డులు, ఫోన్‌లో ఉండే డేటా వాట్సాప్ గ్రూపులు అన్నీ పూర్తి స్థాయిలో తొలగించి ఎన్నికల అధికారులకు అప్పచెప్పాలి. కానీ కోడూరులో ఇప్పటివరకు అధికారులు సచివాలయం సిబ్బంది వద్ద కానీ వలంటీర్ల వద్ద కానీ సిమ్‌కార్డులు తీసుకున్న దాఖలాలు లేవు. ఎన్నికల కోడ్ ఉన్నప్పటికీ ప్రతిరోజూ కోడూరు సచివాలయం-4 లో వైసీపీ ప్రచారాలు జోరు కొనసాగుతోంది. గ్రూపులో ఉన్న అధికారులు తమకు ఏమీ తెలియనట్లు వ్యవహరించడం గమనార్హం. ఈ సంఘటనపై రైల్వేకోడూరు తహసీల్దార్‌ను వివరణ కోరగా సామాజిక మాధ్యమాల్లో వైసీపీకి అనుకూలంగా ప్రచారాలు నిర్వహించిన అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని రాజకీయ పార్టీల నాయకులు కోరుతున్నారు.

రాష్ట్ర అభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యం

● టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి



టీడీపీలో చేరుతున్న వారికి కండువా వేస్తున్న పుత్తా నరసింహారెడ్డి

కమలాపురం రూరల్, మార్చి 19 :ఈ రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే అది చంద్రబాబుతోనే సాధ్యమని, చంద్రబాబుకు అధికారమిస్తే ఈ రాష్ట్రం అభివృద్ధిపథంలో నడుస్తుందని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి అన్నారు. మంగళవారం నగర పంచాయతీ పరిధిలోని పైడిమానుకాలనీ, అప్పాయ్యపల్లె, ఎస్సీ కాలనీ, శ్రీనగర్ కాలనీ, అప్పాయపల్లె తదితర ప్రాంతాల్లో బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమంలో టీడీపీ యువ నాయకుడు కృష్ణచైతన్యరెడ్డితో కలిసి ఆయన ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి చంద్రబాబునాయుడు ప్రకటించిన సూపర్‌సిక్స్ పథకాల గురించి వివరిస్తూ రాబోవు ఎన్నికల్లో టీడీపీని గెలిపించాలని కోరారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జగన్ అధికార దాహంతో ఒక్కఛాన్స్ అంటూ ప్రజల మధ్యకు వచ్చారని, ప్రజలు నమ్మి అవకాశం ఇవ్వగానే అందరినీ మోసగించారన్నారు. చంద్రబాబునాయుడు అధికారంలో ఉన్నప్పుడు అన్నిరకాల కులాలవారికి మేలు జరిగే విధంగా సంక్రాంతి కానుక, క్రిస్మస్‌కానుక, రంజాన్‌తోఫా వంటి పథకాలతో వారి కుటుంబాల్లో ఆనందంగా పండుగ జరుపుకునే విధంగా పరిపాలన చేశారన్నారు. ఈ రాష్ట్రానికి చంద్రబాబు మళ్లీ సీఎం అయితే దేశంలోనే మన రాష్ట్రం మొదటిస్థానంలో నిలుస్తుందన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చాక చేపట్టపోయే సూపర్‌సిక్స్ పథకాలను వివరించారు. లోకేశ్ నాయకత్వంలో ఈ పథకాల ద్వారా ప్రతి కుటుంబానికి న్యాయం జరుగుతుందన్నారు. ఇంటింటికీ మంచి నీటిప థకం కింద రక్షిత తాగునీటి కుళాయి కనెక్షన్ ఏర్పాటు చేస్తామన్నారు. అనంతరం డాక్టర్ సునీల్‌రెడ్డి ఆధ్వర్యంలో 15 కుటుంబాలవారు వైసీసీ నుంచి టీడీపీలో చేరారు. టీడీపీ నాయకులు మాజీ తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు దివాకర్‌రెడ్డి, ఖాదర్‌బాషా, జంపాల నరసింహారెడ్డి, మండల కన్వీనరు రాఘవరెడ్డి, కంకర సుబ్బారెడ్డి, రామసుబ్బారెడ్డి, ధర్మారెడ్డి, వాసుదేవరెడ్డి, ఎల్లారెడ్డి, బోయిళ్ల శంకర్‌రెడ్డి, రామమునిరెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, చిన్నసుబ్బారెడ్డి, దాది రామయ్య, కరి ముల్లా (రెడ్డికరీం), నబీర సూల్ పాల్గొన్నారు.

విజన్ గల నేత చంద్రబాబు నాయుడు

● టీడీపీ కడప ఎమ్మెల్యే అభ్యర్థి మాధవీరెడ్డి



కండువా వేసి టీడీపీలోకి ఆహ్వానిస్తున్న మాధవీరెడ్డి

కడప (ఎడ్యుకేషన్), మార్చి 19 : విజన్‌గల నేత మాజీ సీఎం చంద్రబాబు నాయుడు అని టీడీపీ కడప ఎమ్మెల్యే అభ్యర్థి ఆర్.మాధవీరెడ్డి తెలిపారు. మంగళవారం కడప నగరం 37వ డివిజన్ గంగమ్మ గుడి నుంచి బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. టీడీపీ నాయకులు యువరాజ్, పాలెంపల్లె సుబ్బారెడ్డి, జాకీర్, రాజా, చంద్ర, మన్సూర్, ఆసిఫ్, సునీత, ఆస్మా పాల్గొన్నారు.

టీడీపీలో చేరికలు: కడప నగరం ద్వారకానగర్ టీడీపీ ఎమ్మెల్యే కార్యాలయంలో టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మాధవీరెడ్డి సమక్షంలో ఎండీ హెచ్ బాషా, ఫైరోజ్‌ఖాన్ ఆధ్వర్యంలో పలువురు టీడీపీలో చేరారు. వారికి టీడీపీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు.హైటెక్ సాజిదా, మస్తానీ, నూర్జహాన్, హసీనా, రఫి, రకీబ్, షావల్లి పాల్గొన్నారు.

ఘనంగా రాహుకాల పూజలు



ప్రత్యేక అలంకరణలో విజయదుర్గాదేవి... రాహుకాల దీపాలను వెలిగిస్తున్న భక్తులు

కడప (కల్చరల్), మార్చి 19: విజయదుర్గాదేవి ఆలయంలో మంగళవారం రాహుకాల పూజలు ఘనంగా నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారి సన్నిధికి చేరుకుని అత్యంత భక్తిశ్రద్ధలతో నిమ్మకాయలతో కూడిన రాహుకాల దీపాలను వెలిగించారు. అలా వెలిగించడం వల్ల అమ్మవారు కోర్కెలు వెంటనే నెరవేరుస్తుందని భక్తుల విశ్వాసం.

దేశ ప్రజల మధ్య చీలికలు తెచ్చే చట్టాన్ని వ్యతిరేకించాలి

కడప (సెవెన్‌రోడ్స్), మార్చి 19 : రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా, దేశ సమైక్యతకు సమగ్రతకు నష్టం కలిగించే సీఏఏను రద్దు చేసేంత వరకు పోరాడాలని మంగళవారం స్థానిక సీపీఐ కార్యాలయంలోజరిగిన సదస్సులో సీపీఐ జిల్లా కార్యదర్శి గాలిచంద్ర, సీపీయం జిల్లా కార్యదర్శి చంద్రశేఖ ర్, సీపీఐ ఎంఎల్ డబ్ల్యు రాము, రమణ య్యలు కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం 2019లో పార్లమెంటులో ప్రతిపక్షాల నిరసనల మధ్య ఆమోదింపజేసుకున్న పౌరసత్వ సవరణ చట్టం ఆనాటి ప్రజా ఉద్యమాల ధాటికి తాత్కాలికంగా అమలు చేయలేకపోయిందన్నారు. దేశ ప్రజల మధ్య చీలికలు తెచ్చి భారతదేశ విచ్ఛిన్నానికి, వినాశనానికి ప్రయత్నిస్తున్న బీజేపీ ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా సీఏఏ, ఎన్ఆర్‌సీ, ఎన్‌పీఆర్‌లకు వ్యతిరేకంగా దేశ సమగ్రతను కాపాడుకుంటూ రాజ్యాంగ పరిరక్షణ కోసం ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. సీపీఐ, సీపీయం నగర కార్యదర్శులు ఎన్.వెంకటశివ, రామ్మోహన్‌రెడ్డి, సుబ్రమణ్యం, వీరశేఖర్, అన్వేష్, శివ, కేసీ బాదుల్లా, మనోహర్, శ్రీనివాసులురెడ్డి, దస్తగిరిరెడ్డి, గంగాసురేష్, శివకుమార్, వలరాజు, చిన్ని, మునెయ్య భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

ఘనంగా ఆర్ఎస్‌పీ ఆవిర్భావ దినోత్సవం



ఆవిర్భావ దినోత్సవంలో ఆర్ఎస్‌పీ నాయకులు

కడప (ఎడ్యుకేషన్), మార్చి 19 : కడపనగరం ఆర్ఎస్‌పీ రాయలసీమ జోన్ కార్యాలయంలో ఆ పార్టీ 84వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వమించారు. ముందుగా పార్టీ జెండా ఆవిష్కరించి కేక్ కట్ చేశారు. అనంతరం రాష్ట్ర కన్వీనరు సుబ్బరాయుడు మాట్లాడుతూ ప్రపంచంలో ఏ దేశంలో లేనన్ని కులాలు మతాలు భారతదేశంలో ఉన్నాయన్నారు. ఇలాంటి దేశంలో బీజేపీ, ఆర్ఎస్ఎస్ లాంటి మతోన్మాద పార్టీలు దేశంలో ప్రజల ఐక్యత దెబ్బతీసే విధంగా ప్రజల మధ్య చిచ్చుపెట్టడం జరుగుతుందన్నారు. ఇలాంటి తరుణంలో దేశంలో మత సామరస్యాన్ని సమగ్రతను సౌభ్రాతృత్వాన్ని కాపాడుకోవాలంటే బీజేపీ తెచ్చిన పౌరసత్వ సవరణ చట్టానికి వ్యతిరేకంగా పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. ఆర్ఎస్‌పీ నాయకులు కళ్యాన్, ఓబులేసు, గోవిందరాజు, గోపి, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఆప్‌కి ఆవాజ్ ఆధ్వర్యంలో రమదాన్ కిట్లు పంపిణీ

కడప (సెవెన్‌రోడ్స్), మార్చి 19 : ఓ దాత ఇచ్చిన సహాయంతో రంజాన్ తోఫా కిట్లను ఆప్‌కి ఆవాజ్ కమిటి ఆధ్వర్యంలో ఆ కమిటి రాష్ట్ర కార్యదర్శి మగ్బుల్ బాషా నగరంలోని పేద ముస్లింలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మగ్బుల్‌బాషా మాట్లాడుతూ రంజాన్ మాసంలో ప్రతి ఒక్కరూ ఆరాధనలకు ప్రాధాన్యతనివ్వాలన్నారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా చాలా మంది నిత్యావసర వస్తువుల సేకరణ కే ఎక్కువ సమయం వెచ్చించాల్సి వస్తుందన్నారు. అటువంటి వారికి తాము 12 కిలోల బియ్యం, గోధుమ పిండి, నూనె రవ్వ, చక్కెర, పసుపు, ధనియాల పొడి, మిర్చిపొడి, చింతపండు, సేమియాలు, బాదంపప్పు, కాజు, నెయ్యితో కూడిన కిట్టును అందిస్తున్నట్లు తెలిపారు.

రాహుల్‌ను ప్రధానిని చేయడమే అందరి లక్ష్యం



మాట్లాడుతున్న శ్రీనివాసరెడ్డి

పులివెందుల టౌన్, మార్చి 19: రాహుల్ గాంధీని ప్రధానిని చేయడమే లక్ష్యమని ఆ దిశగా పనిచేద్దామని పులివెందుల నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి శ్రీనివాస రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం ఆయన కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా ఎదగడం కోసం అంగన్వాడీ, ఆశావర్కర్ల కో సం కేంద్ర ప్రభుత్వం నుంచి ప్రోత్సాహకంగా జీతాలలు పెంచి వా రికి ఉపయోగపడే విధంగా సమాన పనికి సమాన వేతనం ఇస్తామని, ఇందిరమ్మ అభయహస్తం, న్యాయపథకం, రైతులకు రూ.3లక్షలు రుణమాఫీ లాంటి పథకాలు ప్రకటించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఏఆర్ఎస్ఐకి రాష్ట్ర సేవా పతకం



జగన్‌మోహన్‌రెడ్డి

కడప (ఎర్రముక్కపల్లె), మార్చి 19 :కడప రైల్వేస్టేషన్‌లో ఏఆర్ ఎస్ఐగా పనిచేస్తున్న జగన్‌మోహన్‌రెడ్డికి రాష్ట్ర ప్రభుత్వం సేవా పతకం అవార్డు ప్రకటించింది. 1989 బ్యాచ్‌కు చెందిన ఈయన విధుల్లో మెరుగైన పనితీరు కనబరచడంతో పాటు సీనియారిటీ ప్రకారం ఆయనకు రాష్ట్ర ప్రభుత్వం సేవా పతకం అవార్డు లభించింది. ఆగష్టు 15న అవార్డును గుంతకల్లు రైల్వే ఎస్పీ చేతుల మీదుగా అందుకోనున్నారు. కడపలో కానిస్టేబుల్‌గా 1989లో విధుల్లో చేరి ఆ తరువాత హెడ్‌కానిస్టేబులుగా, ఎఆర్ ఎస్ఐగా వివిధ హోదాల్లో పనిచేశారు. ఈయనకు ఈ అవార్డు రావడం పట్ల కడప రైల్వే పోలీసులు సంతోషం వ్యక్తం చేశారు.

ఎన్ఎస్ఎస్ విద్యార్థుల స్వచ్ఛభారత్



పాఠశాలలో విద్య ప్రాముఖ్యతను వివరిస్తున్న ట్రిపుల్‌ఐటీ ఎన్ఎస్ఎస్ విద్యార్థిని

వేంపల్లె, మార్చి 19: మండలంలోని కుమ్మరాంపల్లె, నందిపల్లె గ్రామాలలో ఇడుపులపాయ, ఒంగోలు ట్రిపుల్‌ఐటీలకు చెందిన ఎన్ఎస్ఎస్ విద్యార్థులు స్వచ్ఛభారత్ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఇందులో భాగంగా వీధులను, గుడి, అంగన్వాడీ కేంద్రాల పరిసరాలను శుభ్రపరిచారు.బాలికా విద్య, పాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆఫీసర్లు తిరుపతిరెడ్డి, ఇందుమతి, కోఆర్డినేటర్ మధుసూధన్ పాల్గొన్నారు.

ఆర్టీసీ పురోగతే అందరి లక్ష్యం

కడప (మారుతీనగర్) మార్చి 19. ఆర్టీసీ పురోగతే అందరి లక్ష్యమని, యూనియన్‌లనే తారతమ్య భేదాలను సంబంధిత అధికారులు, సూపర్‌వైజర్లు విడనాడి ఉద్యోగులందరినీ కలుపుకుని తద్వారా సంస్థను నష్టాల బాట నుంచి లాభాలబాట పట్టించేందుకు శ్రమించాలని ఆర్టీసీ కార్మిక పరిషత్ జోనల్ ఛైర్మన్ వీవీఎస్ నారాయణ, రీజనల్ కార్యదర్శి ఎం.పురుషోత్తం కోరారు. మంగళవారం ప్రెస్‌క్లబ్‌లో పురుషోత్తం ఆధ్వర్యంలో నారాయణ అధ్యక్షతన ఆర్టీసీ కార్మిక పరిషత్ రీజనల్ కౌన్సిల్ సమావేశం జరిగింది.

అసాంఘిక శక్తులారా ఖబడ్దార్!

● ఎన్నికలకు పోలీసులు సన్నద్ధం



యాంటీ రయట్ డ్రిల్ నిర్వహిస్తున్న పోలీసు సిబ్బంది

కడప (క్రైం), మార్చి 19:ఎన్నికల నేపథ్యంలో ఎస్పీ సిద్దార్థ కౌశల్ ఆదేశాల మేరకు ఇటీవల ప్రారంభమైన యాంటి రయట్ డ్రిల్ శిక్షణ ముమ్మరంగా కొనసాగుతోంది. మంగళవారం సివిల్, స్పెషల్ పార్టీ పోలీసులు సిబ్బంది నూతనోత్సాహంతో శిక్షణలో పాల్గొన్నారు. ఏఆర్ అదనపు ఎస్పీ ఎస్ఎస్ఎస్‌వీ క్రిష్ణారావు శిక్షణను పరిశీలించి సిబ్బంది స్పందనను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సిబ్బంది స్పందిస్తూ ఎస్పీ ఆలోచనా విధానానికి తగ్గట్లుగా తాము మరింత మెరుగైన విధులు నిర్వహించేందుకు కార్యక్రమం దోహదపడుతుందన్నారు. ఎంతో ఉపయోగకరంగా ఉందని, తమలో ఎలాంటి కఠిన పరిస్థితులనైనా ఎదుర్కోగలమనే ధీమా ను పెంపొందించిందని ఎస్పీకి కృతజ్ఞతలు తెలిపారు. శిక్షణలో భాగంగా గ్యాస్ గన్‌తో గ్యాస్‌షెల్ వినియోగించే విధానం, వజ్రవాహన వినియోగం, లారీ డ్రిల్ తదితర అంశాలపై తర్ఫీదు ఇచ్చారు. కార్యక్రమంలో ఎఆర్ డీఎస్పీ మురళీధర్, ఆర్ఐలు ఆనంద్, వీరేష్, శివరాముడు, టైటాస్, ఆర్ఎస్ఐలు, ఎఆర్ సివిల్, స్పెషల్ పార్టీ పోలీసులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు వేగవంతంగా పూర్తి చేయాలి: కమిషనర్



అభివృద్ధి పనులు పరిశీలిస్తున్న కమిషనర్ ప్రవీణ్‌చంద్

కడప (ఎడ్యుకేషన్), మార్చి 19 : కడప కార్పోరేషన్ పరిధిలో జరుగుతున్న అబివృద్ధి పనులు వేగవంతంగా పూర్తి చేయాలని కమిషనర్ ప్రవీణ్‌చంద్ ఇంజనీరింగ్ అధికారులకు ఆదేశించారు. నాణ్యతలోపాలు లేకండా చూడాలని అన్నారు. మంగళవారం కడప నగరంలో జరుగుతున్న అభివద్ధి పనులకు సంబంధించి అన్నమయ్య సర్కిల్, క్రిష్ణసర్కిల్, పొట్టిశ్రీరాములు సర్కిల్, దేవునికడప రోడ్డు ప్రాంతాలను టౌన్ ప్లానింగ్, ఆర్అండ్‌బి ఇంజనీరింగ్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అబివృద్ధి పనులు జరుగుతున్న నేపథ్యంలో మ్యాన్ హోల్ పనులు తక్షణమే పూర్తి చేయాలని సూచించారు. అలాగే డివైడర్లు నిర్మించేందకు తగిన ప్రణాళికలు యాపొందించాలని ఇంజనీరింగ్ అధికారులకు తెలిపారు. డ్రైనేజీ పనులపై ల్యాబ్‌లు ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో పలువురు అధికారులు పాల్గొన్నారు.

ప్రచారానికి అనుమతి తప్పనిసరి: ఆర్డీఓ



ఎన్నికల ప్రవర్తన నియమావళిపై మాట్లాడుతున్న ఆర్డీఓ

పులివెందుల రూరల్, మార్చి 19: ఇంటింటికి వెళ్లడం, ర్యాలీలు చేపట్టడం, సభలు నిర్వహించడం లాంటి ప్రచార కార్యక్రమాలకు అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని పులివెందుల రెవిన్యూ డివిజనల్ ఆఫీసర్ మరియు ఆర్‌ఓ వెంకటేశులు పేర్కొన్నారు. స్థానిక కార్యాలయంలో మంగళవారం రాజకీయ పార్టీల నేతలతో ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ప్రవర్తన నియమావళిపై ఆర్డీఓ సమావేశం నిర్వహించారు. ఆర్డీఓ మాట్లాడుతూ ప్రచారానికి సంబంధించి సువిధ యాప్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. అందులో కానిపక్షంలో ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. తేదీ, సమయం, ప్రదేశం, ముగింపు సమయం, ఖర్చు, వాహనాలు తదితర అంశాలను తెలియజేయాల్సి ఉంటుందన్నారు. 48గంటల ముందు దరఖాస్తు చేసుకున్నట్లు అయితే ఆయా శాఖలకు సంబంధించి అంటే ఎలక్ట్రికల్, ఆర్‌డబ్ల్యూఎస్, మున్సిపల్, రెవెన్యూ, పోలీస్ తదితర శాఖలు అనుమతులు ఇచ్చేందుకు, శాంతి భద్రతలకు, ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. అప్పటికప్పుడు దరఖాస్తు చేసుకుంటే పరిశీలించి పర్యవేక్షించేందుకు వీలుపడదన్నారు. అంతేకాకుండా సమస్యలు తలెత్తకుండా ప్రచార సమయంలో ఎంసీసీ బృందం కెమెరాతో పర్యవేక్షిస్తుందన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.సోషల్ మీడియాలో రెచ్చగొట్టే విధంగా పోస్టులు పెట్టడం, ప్రచార సమయంలో వ్యక్తిగత ఆరోపణలు చేయడం, కులం, మతం ఆధారంగా ప్రచారం నిర్వహించడం లాంటివి చేస్తే కేసు నమోదు చేస్తామన్నారు. అంతేకాకుండా రాజకీయ నాయకుల ఫోటోలు ప్రజలకు కనిపించేలా ఏర్పాటుచేయవద్దన్నారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు అన్ని పార్టీలు సహకరించాలని ఆర్డీఓ కోరారు. కౌన్సిలర్లు, సర్పంచులు, ఎంపీటీసీలు తదితర ప్రజాప్రతినిధులు గౌరవవేతనం పొందుతారని వారు ఈసీ సూచించిన పరిధిలోకి రారని ఆర్డీఓ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అర్బన్ మరియు రూరల్ సీఐలు శంకర్‌రెడ్డి, బాలమద్దిలేటి, మున్సిపల్ కమిషనర్ రమణరెడ్డి, అన్నిపార్టీల నాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాగళం సభలో భద్రతా వైఫల్యం

● పోలీసు అధికారులపై చర్యలు తీసుకోవాలి

కడప (ఎడ్యుకేషన్), మార్చి 19 : ప్రజాగళం సభలో భద్రతా వైఫల్యం స్పష్టంగా కనిపించిందని టీడీపీ జిల్లా అధ్యక్షుడు పొలిట్ బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి కడప ఎమ్మెల్యే అభ్యర్థి ఆర్.మాధవీరెడ్డి ఆరోపించారు. భద్రత కల్పించడంలో విఫలమైన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దేశ ప్రధాని నరేంద్ర మోదీ హాజరైన చిలకలూరిపేట బొప్పాడి ప్రజాగళం సభ భద్రతలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన పోలీసు ఉన్నతాధికారులపై చీఫ్ ఎలక్షన్ కమిషనర్ తక్షణమే చర్యలు తీసుకోవాలన్నారు. లక్షలాది మంది జనం తోసుకుని వస్తుంటే నియంత్రించాల్సిన పోలీసులు చోద్యం చూడడం దేనికి సంకేతమని ప్రశ్నించారు. బీజేపీ, టీడీపీ, జనసేన తొలి ఎన్డీఏ సభ నభూతోనభవిష్యత్ అన్నట్లుగా విజయ వంతమైందన్నారు. మూడు పార్టీల కార్యకర్తలు, అభిమానులు పాల్గొని సభను విజయవంతదం చేశారన్నారు. అయితే ట్రాఫిక్ జామ్ వల్ల వేలాది మంది కార్యకర్తలు సభకు రాలేకపోయారన్నారు. లక్షలాది మంది ప్రజలు హాజరైన సభకు పోలీసులు ఇచ్చే భద్రత ఇదేనా అని, కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జామ్ అయిందని తెలిపారు. స్వయంగా ప్రధాని హాజరైన సభ వైపు జనం దూసుకుస్తుంటే నియంత్రించాల్సిన బాధ్యత పోలీసులకు లేదా అన్నారు. ప్రధాని సభలో క్రౌడ్ మేనేజ్‌మెంటు బాధ్యత ఎవరిదని, అధికారులను ఏర్పాటు చేసి జనాలను నియంత్రించాల్సిన బాధ్యతపై సీనియర్ పోలీసు అధికారులకు లేదా అన్నారు. జగన్‌రెడ్డి ప్రభుత్వంతో పాటు అందులో పనిచేస్తున్న కొందరు అధికారులు ఉద్దేశ్యపూర్వకంగానే సభకు అడ్డంకులు సృష్టించేందుకు ప్రయత్నించారని ఆరోపించారు. ఎవరు ఎన్ని కుట్రలు చేసినా టీడీపీ, జనసేన. బీజేపీ నేతలు, కార్యకర్తలు సభను విజయవంతం చేశారని తెలిపారు.

పార్లమెంటులో ప్రసంగించిన విద్యార్థులకు సన్మానం



విద్యార్థులను సత్కరిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ సలీంబాషా

కడప (ఎడ్యుకేషన్), మార్చి 19 : కడప నగరం కోటిరెడ్డి ప్రభుత్వ మహిళా డిగ్రీకళాశాలలో డిగ్రీ పూర్తి చేసిన ఇద్దరు విద్యార్థినులు నిత్యరూప, సయ్యద్ సానియా పార్లమెంటులో అద్భుతంగా ప్రసంగించినందుకు కళాశాల స్టూడెంట్ యూనియన్ ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ఘ నంగా సత్కరించారు. ఈ సందర్భం గా ముఖ్యఅతిథిగా నెహ్రూ యువకేంద్ర యూత్ ఆఫీసరు కె.మణికంఠ మాట్లాడుతూ కోటిరెడ్డి ప్రభుత్వ మహిళా కళాశాల నుంచి 2022 అక్టోబరు 2న పార్లమెంటు సెంట్రల్ హాలులో చాలా అద్భుతంగా విద్యార్థులు ప్రసంగించారన్నారు.ఇదే కళాశాలకు చెందిన సయ్యద్ సానియా నేషనల్ యూత్ పార్లమెంటు పోటీల్లో జిల్లా స్థాయి, రాష్ట్ర స్థాయిలో విజయం సాధించి జాతీయ స్థాయిలో 2024 మార్చి 5, 6 తేదీల్లో జరిగిన జాతీయ యువ పార్లమెంటు ఉత్సవాల్లో బాగా అద్భుతంగా ప్రసంగించి అందరి మన్ననలను పొందిందని తెలిపారు. ఎన్ఎస్ఎస్ పీఓ డాక్టర్ శచీదేవి, డాక్టర్ గురుమోహన్‌రెడ్డి, డాక్టర్ క్రిష్ణవేణి, కేవీ రమణ, సుబ్బారెడ్డి,శాలిని, రవిశేఖర్, నాగవేణి తదితరులు పాల్గొన్నారు.

పాత పెన్షన్‌తోనే ఉద్యోగులకు ప్రయోజనం

● కలెక్టరేట్ ఎదుట బుక్‌లెట్ల పంపిణీ

కడప (ఎడ్యుకేషన్), మార్చి 19 : ప్రభుత్వ ఉద్యోగ ఉపాధ్యాయులకు సీపీఎస్, జీపీఎస్ విధానాల కన్నా పాత పెన్షన్ విధానమే ప్రయోజనమని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మిరాజా, జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్‌బాబు తెలిపారు. మంగళవారం సాయంత్రం కడప కలె క్టరేట్‌లో సీపీఎస్, జీపీఎస్ విధానం వల్ల కలిగే నష్టాలు తెలిపే బుక్‌లెట్ పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగి 30 సంవత్సరాలకు పైగా ప్రభుత్వ సేవలో పనిచేసినప్పటికీ పదవీ విరమణ పొందిన అనంతరం భరోసా కల్పించే పెన్షన్ విధానం లేకపోవడం వృద్ధాప్య జీవితం ఒడిదుడుకులకు గురయ్యే ప్రమాదం ఉందన్నారు. ప్రస్తుతం ఉన్న సీపీఎస్, జీపీఎస్ విధానాలు ఉద్యోగ ఉపాధ్యాయులకు ఏ మాత్రం ప్రయోజనకం కాదని పాతపెన్షన్‌విధానమే అన్నిరకాలుగా ఉపయోగమన్నారు. జిల్లా ట్రెజరర్ నరసింహారావు, కార్యదర్శులు సీవీరమణ, నాయకులు ప్రభాకర్, రామసుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

16 మంది జేఎన్టీయూ విద్యార్థులకు ఉద్యోగాలు

పులివెందుల రూరల్, డిసెంబరు 19: పులివెందుల జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ఆర్.రమణారెడ్డి తెలిపారు. మంగళవారం కళాశాలలో క్యూస్పైడర్స్ కంపెనీ క్యాంపస్ డ్రైవ్ నిర్వహించిందన్నారు. ఇందులో బీటెక్ నాలుగో సంవత్సరం సీఎస్ఈ బ్రాంచ్ నుంచి నలుగురు, మెకానికల్ బ్రాంచ్ నుంచి ఒక్కరు, ఈఈఈ బ్రాంచ్ నుంచి ఒక్కరు, ఈసీఈ బ్రాంచ్ నుంచి పదిమంది ఎంపికయ్యారన్నారు. వీరికి ఏడాదికి రూ.3.50లక్షల నుంచి రూ.5.50లక్షల నుంచి ఉం టుందని తెలిపారు. ఎంపికైన విద్యార్థులను మరియు ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ అధికారి డాక్టర్ ఎస్.రాధాకృష్ణ మరియు అసిస్టెంట్ ట్రైనింగ్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ డాక్టర్ ఎం.సాంబయ్యలను ప్రిన్సిపల్ రమణారెడ్డి, వైస్ ప్రిన్సిపల్ ప్రొఫసర్ ఎం.సూర్యనారాయణరెడ్డి అభినందించారు.

తల్లీబిడ్డల సంరక్షణే లక్ష్యం: సీడీపీఓ

చక్రాయపేట, మార్చి 19: తల్లీబిడ్డల సంరక్షణే పోషణ పక్వాడ్ ఉద్దేశమని ఐసీడీఎస్ సీడీపీఓ సునీత అన్నారు. మంగళవారం మండలంలోని అన్ని అంగన్వాడీలతో కలిసి పోషణ పక్వాడ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణీ, బాలింతలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు పోషకాహార, రక్తహీనత, ముర్రుపాలు తదితర వాటిపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. పిల్లల్లో పోషకాహార లోపం, పెరుగుదల పర్యవేక్షణ, పరిసరాల పరిశుభ్రత, నీటటి సంరక్షణ ఆకుకూరలు, కూరగాలు, బెల్లం, కర్జూరం, రాగులు, పాలు, కోడిగుడ్లు ద్వారా లభించే పోషకాలను వివరించారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ నాగసుబాషిణి, సీహెచ్‌ఓ వెంకటరామిరెడ్డి, అంగన్వాడీ టీచర్లు, పిల్లల తల్లులు పాల్గొన్నారు.

వడదెబ్బపై అవగాహన కలిగి ఉండాలి


బద్వేలు, మార్చి 19: పట్టణంలోని ఎస్‌బీవీఆర్ కళాశాలలో మంగళవారం ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో వడదెబ్బపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ వెంకటసుబ్బారెడ్డి మాట్లాడుతూ వడదెబ్బ సోకిన వ్యక్తికి విరోచనాలు, వాంతులు కావడం, జ్వరం రావడం, గుండె వేగంగా కొట్టుకోవడంతో పాటు మూత్రం పచ్చగా రావడం తదితర లక్షణాలు ఉంటాయన్నారు. వేసవికాలంలో కాటన్ దుస్తులు ధరించడం, ఓఆర్ఎస్‌లు, గ్లూకోజ్, మజ్జిగ తాగడం, కొబ్బరినీళ్లు, నిమ్మకాయ నీరు తీసుకోవడం వంటి వాటినుంచి రక్షణ పొందాలన్నారు.

బటన్ నొక్కుడు కంటే మద్యం బొక్కుడు జాస్తి

● డీసీసీ అధ్యక్షుడు శ్రీరాములు

కడప(కలెక్టరేట్), మార్చి 19: ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి బటన్ నొక్కుడు కంటే మద్యం బొక్కుడు జాస్తి అయిందని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు జి.శ్రీరాములు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అధికారంలో ఉన్న ఐదేళ్లు బటన్ నొక్కుడు కంటే మద్యంపై వచ్చిన ఆదాయాన్ని పెద్ద ఎత్తున బొక్కాడని ఆరోపించారు. అవినీతి అనకొండ ముఖ్యమంత్రిగా చరిత్రలో నిలిచిపోతారన్నారు. ప్రాజెక్టులకు గేట్లు పెట్టలేదని, మళ్లీ అధికారంలోకి వస్తే పోలవరం, ఇతర పెండింగ్ ప్రాజెక్టులు నిర్మించడం అసాధ్యమన్నారు. ఎన్నికల్లో ఓటుతో వైకాపాను ఇంటికి పంపాలనీ, కాంగ్రెస్ కు ఓటేస్తే ప్రత్యేక హోదా ఖాయమన్నారు.

'అధికార పార్టీకి ఎన్నికల కోడ్ పట్టదా?'



సబ్ రిజిస్ట్రారు కార్యాలయం వద్ద ఉన్న బెంచ్‌లు

కమలాపురం రూరల్, మార్చి 19 : సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో దేశమంతటా ఎన్నికలకోడ్ అమల్లోకి వచ్చింది. రాష్ట్రంలో లోక్‌సభ, శాసనసభ ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో కోడ్‌ను మరింత పకడ్బందీగా అమలు చేయాలని కేంద్ర రాష్ట్ర ఎన్నికల సంఘాలు జిల్లా కలెక్టరుకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశాయి. దీంతో అధికారులు ప్రభుత్వ కార్యాలయాలు, బహిరంగ ప్రదేశాల్లో రాజకీయ పార్టీల జెండాలు, నేతల ఫ్లెక్సీలను తొలగించినప్పటికీ మరో వైపు ఉల్లంఘనలు జరుగుతూనే ఉన్నాయి. కమలాపురం నియోజకవర్గంలో ఎన్నికల కోడ్ విషయంలో అధికారులు పక్షపాత ధోరణితో వ్యవహరిస్తున్నారని ప్రతిపక్షాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. కమలాపురం ఎమ్మెల్యే తనయుడు సీకేదిన్నె జడ్పీటీసీ నియోజకవర్గంలోని పార్కుల్లో, ప్రభుత్వ కార్యాలయాల సముదాయాల్లో, ఇతర ప్రాంతాల్లో సిమెంటు బెంచీలు వేయించి పేరు కూడా రాయించారు.

ప్రైవేట్ ఆసుపత్రుల సిబ్బంది వివరాలు నమోదు చేయాలి

కడప(కలెక్టరేట్), మార్చి 19: అయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్(ఏబీడీఎం) కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని ప్రైవేట్ ఆసుపత్రులు, నర్సింగ్ హోమ్‌ల్లో పనిచేసే బీఎస్సీ నర్సింగ్, స్టాఫ్ నర్సులు, ల్యాబ్ టెక్నీషియన్ల వివరాలను ఏబీడీఎంలో తప్పక రిజిస్టర్ చేసుకోవాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ నాగరాజు మంగళ వారం ఒక ప్రకటనలో తెలిపారు. కావున ప్రైవేట్ ఆసుపత్రుల సిబ్బంది ఈ విషయాన్ని గమనించాలన్నారు.

కిశోర బాలికల సమాచారం కలిగి ఉండాలి

ముద్దనూరు మార్చి19:అంగన్వాడీలలో కిశోర బాలికలకు సంబంధించి పూర్తి సమాచారం కల్గి ఉండాలని శిశు సంక్షేమ శాఖ పథక సంచాలకురాలు శ్రీలక్ష్మి పేర్కొన్నారు. స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పోషణ్ పఖ్వాడ్ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా శ్రీలక్ష్మి పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ లబ్ధిదారులకు అందించే పోషకాహార సరుకులు ఫెసియల్ యాప్ ద్వారా అందించాలన్నారు. అనంతరం పిల్లలకు అన్నప్రాసన చేశారు.ఈ కార్యక్రమంలో సీడీపీవో ముంతాజ్‌బేగం,జిల్లా బాలల పరిరక్షణ విభాగం కౌన్సిలర్ మహేష్, సూపర్‌వైజర్లు, అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

నాలుగు గ్రామాల్లో కవాతు

ఎర్రగుంట్ల, మార్చి 19: కలమల్ల పోలీసుస్టేషన్ పరిధిలోని కలమల్ల, ఇల్లూరు, చిన్నదండ్లూరు, మాలేపాడు గ్రామాల్లో సార్వత్రిక ఎన్నికల కోసం వచ్చిన ప్రత్యేక సాయుధదళాలతో మంగళవారం కవాతు నిర్వహించారు. నాలుగు గ్రామాల్లోని వీధుల్లో వారు తిరుగుతూ ప్రజలకు హెచ్చరికలు జారీ చేశారు. కలమల్ల ఎస్ఐ సంజీవరెడ్డి ఆధ్వర్యంలో ఈ కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు పాల్పడరాదని, ఎన్నికల కోడ్ ఉల్లంఘన చేస్తే చట్టపరమైన కఠిన చర్యలుంటాయని తెలిపారు. ముఖ్యంగా ఫ్యాక్షన్ గ్రామాల్లోని గడ్డివాములు, కొన్ని ఇళ్లల్లో వారు తనిఖీలు చేశారు. ఈ కార్యక్రమంలో కలమల్ల పోలీసుసిబ్బంది, జమ్మలమడుగు డివిజన్‌కు కేటాయించిన సాయుధ దళాలు పాల్గొన్నాయి.

చెరువులకు గండ్లు పూడ్చరా..?

● తెగిన చిన్నదుద్యాల, ముద్దనూరు చెరువులపై నిర్లక్ష్యం


తెగిపోయిన చిన్నదుద్యాల చెరువు

ముద్దనూరు మార్చి19: జగన్మోహనరెడ్డి సీఎం అయినప్పటి నుంచి రైతులకు చేసింది ఏమీలేదు,కనీసం సాగునీటిపై కూడా దృష్టి పెట్టలేదని, తెగిన చెరువులకు మరమ్మతులు కూడా చేయలేదని బాహాటంగానే రైతన్నలు విమర్శలు గుప్పిస్తున్నారు. వైసీపీ ప్రభుత్వం ఏర్పాటై ఏడాది గడిచిన తరువాత 2020 సంవత్సరంలో రాష్ట్ర మంతా కురిసిన భారీ వర్షాలకు ముద్దనూరు,చిన్నదుద్యాల చెరువులకు ఉధృతంగా వర్షపు నీరు వచ్చి చేరడంతో భారీ గండ్లు ఏర్పడ్డాయి.అప్పటిలో రైతుల సాగు చేసిన చీనీ, పంటపొలాలపై చెరువు గండి పడి నీరు ప్రవహించడంతో భారీ పంట నష్టం వాటిల్లింది. చీనీ, ఇతర పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి.కొంత మంది రైతులకు నష్టపరిహారం అందినా, కొంత మందికి ఇప్పటికీ అందలేదు.అప్పటి నుంచి ఆ చెరువులు మరమ్మతులకు నోచుకోలేదు. చిన్నదుద్యాల చెరువు క్రింద భూములు ఉన్న చిన్నదుద్యాల, బడుగువారిపల్లె, ముద్దనూరు చెరువు క్రింద పంటసాగు చేస్తున్న రైతులు బోర్లలో చాలీచాలని నీటితో పంటసాగు చేస్తున్నారు. మరి కొందరు రైతులు పంటలు సాగు చేయలేని పరిస్థితుల్లో వర్షం మీద ఆధారపడుతున్నారు.రైతు ప్రభుత్వం అని చెప్పుకుంటున్న సీఎం జగన్మోహనరెడ్డి రైతులకు ఎంటువంటి సహాయం అందించలేదని రైతులు విమర్శిస్తున్నారు.వైసీపీ ప్రభుత్వంలోనే చెరువులు తెగినా పట్టించుకునే వారు లేరని వాపోతున్నారు.

రైతులకు తీవ్ర నష్టం: ఓబులేసు, రైతు, బడుగువారిపల్లె

భారీ వర్షాలకు చిన్నదుద్యాల చెరువు తెగడంతో తీవ్రంగా నష్టపోయాం.అప్పటిలో సాగు చేసిన పంటలన్నీ నీటిలో కొట్టుకుపోయాయి.రైతులను ఆదుకుంటాం అన్న జగన్మోహనరెడ్డి మాటలూ నీటిలో కొట్టుకుపోయాయి. చెరువు తెగి నాలుగు సంవత్సరాలైనా గండి పూడ్చలేకపోయారు.

పర్యావరణాన్ని పరిరక్షించాలి



మొక్కలు నాటుతున్న విద్యార్థులు

ప్రొద్దుటూరు టౌన్, మార్చి 19: ప్రతి ఒక్కరూ మొక్కలను నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని లేపాక్షి డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ ఆర్.రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం కళాశాల ఎన్ఎస్ఎస్-2 యూనిట్ ఆధ్వర్యంలో భగత్‌సింగ్ కాలనీలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ప్రోగ్రాం ఆఫీసర్ పుల్లయ్య, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ ఆఫీసులో పోస్టర్ల తొలగింపు

ముద్దనూరు మార్చి19: స్థానిక టీడీపీ కార్యాలయంలో పోస్టర్లు, గుర్తులను ఎన్నికల నిబంధనలో భాగంగా అధికారులు సోమవారం తొలగించారు. ఎంపీడీవో చంద్రమౌళి ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ , రెవెన్యూ సిబ్బంది తొలగించారు. పోలింగ్ కేంద్రానికి 200 మీటర్ల దూరంలో కార్యాలయం ఉన్నందున తొలగించామని ఎంపీడీవో తెలిపారు. ఎన్నికల నిబంధనల ప్రకారం పార్టీల రంగులు, బ్యానర్లు తొగిస్తున్నామని ఎంపీడీవో తెలిపారు.

వంద కుటుంబాలు టీడీపీలో చేరిక


వరదరాజులరెడ్డి ఆధ్వర్యంలో టీడీపీలో చేరిన కుటుంబాలు

ప్రొద్దుటూరు, మార్చి 19 : ప్రొద్దుటూరులో టీడీపీకి ప్రజా బలం అంచలంచెలుగా పెరుగుతూనే వుందని మాజీ ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం టీచర్స్ కాలనీలోని కాంట్రాక్టర్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో వంద కుటుంబాలు టీడీపీలో చేరాయి. మాజీ ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి, మాజీ ఎంపీపీ రాఘవరెడ్డి, కొండారెడ్డి పార్టీ కండువాలు కప్పి వారిని ఆహ్వానించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య, మాజీ మున్సిపల్ చైర్మెన్ ఆసం రఘురామిరెడ్డి, నాగమునిరెడ్డి, రామచంద్రారెడి, జనసేన సుంకర మురళి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీతో కలిసి ఎన్నికల ప్రచారానికి వెళతాం

గొర్రె శ్రీనును కలిసి చర్చించిన వరదరాజులరెడ్డి

ప్రొద్దుటూరు, మార్చి 19 : రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ,బీజేపీ, జనసేన కూటమి ద్వారానే ఎన్నికల ప్రచారం మొదలు పెట్టి ప్రొద్దుటూరులో వైసీపీని ఓడించడమే లక్ష్యంగా ముందుకు సాగుతామని మాజీ ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం బీజేపీ కార్యాలయానికి వెళ్ళి ఆ పార్టీ కన్వీనర్ గొర్రె శ్రీనును మాజీ ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి కలిశారు. ఇందుకు గొర్రె శ్రీను సానుకూలంగా స్పందించారు. పార్టీ ఆదేశానుసారం తాము టీడీపీకి మద్దతుగా ఎన్నికల్లో ప్రచారం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య, మున్సిపల్ మాజీ చైర్మెన్ ఆసం రఘురామిరెడ్డి తదితరులు ఉన్నారు.

ఘనంగా పెద్దమ్మ జాతర

మైలవరం, మార్చి 19: మండల పరిధిలోని బూబు సానిపల్లి గ్రామంలో మంగళవారం పెద్దమ్మ అమ్మవారి జాతర గ్రామ పెద్దల ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. స్థానికులే కాకుండా ఇతర ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అమ్మవారికి తమ మొక్కులు తీర్చుకున్నారు. జమ్మలమడుగు ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, టీడీపీ ఇన్‌చార్జ్ భూపేశ్‌రెడ్డి జాతరకు హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఓపెన్ స్టడీ సెంటర్ నిర్వాహకుడిపై చర్యలు తీసుకోవాలి

ప్రొద్దుటూరు టౌన్, మార్చి 19: తమను అకారణంగా దూషించి బెదిరింపులకు పాల్పడిన నాగార్జున ఓపెన్ స్కూల్ స్టడీ సెంటర్ నిర్వాహకుడిపై చర్యలు తీసుకోవాలని రాయలసీమ విద్యార్థిసంఘం రాష్ట్ర అధ్యక్షుడు జగన్, ప్రగతిశీల విద్యార్థి యువజన సమాఖ్య రాష్ట్ర కన్వీనర్ కత్తి ఓబులేసు పేర్కొన్నారు. సోమవారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ పది, ఇంటర్ దూర విద్యా పరీక్షల్లో మాస్‌కాపీయింగ్ జరుగకుండా చర్యలు తీసుకోవాలని ఈనెల 13వ తేదీ డీఈవో అనూరాధకు ఫిర్యాదు చేశామన్నారు. ఆ ఫిర్యాదును దృష్టిలో ఉంచుకుని పరుష పదజాలంతో దూషించారన్నారు. సమావేశంలో ఆర్ఎస్‌వో పట్టణాధ్యక్షుడు శ్రీకాంత్ పాల్గొన్నారు.

కేజీబీవీలో ప్రవేశానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు

మైదుకూరు, మార్చి 19 : మైదుకూరులోని కస్తూర్బా గాంధీ పాఠశాలలో ప్రవేశానికి విద్యార్థినులు ఏప్రిల్ 11 లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్స్‌పాల్ విజయ పేర్కొన్నారు. ఆరో తరగతిలో 40 సీట్లు, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరానికి (బైపీసీ) 40 సీట్లు ఉన్నాయన్నారు. అలాగే 7,8,9 తరగతుల వారికి మిగిలిన సీట్లు ఉన్నాయన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ బీపీఎల్ వర్గాలకు చెందిన విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని తెలిపారు.

ఆలయంలో పూజలు చేసిన చినజీయర్ స్వామి



మైదుకూరు, మార్చి 19 : పట్టణ శివారులోని శ్రీనగర్‌లో ఇటీవల నూతనంగా నిర్మించిన శ్రీపంచ ముఖ ఆంజనేయ స్వామి ఆలయ ంలో మంగళవారం చినజీయర్ స్వామి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సంద ర్భంగా ఆలయ నిర్వా హకులు గోశెట్టి వెంకట రమ ణయ్య ప్రత్యేకంగా ఆయనను ఆహ్వానించారు.

అంతా 'ఓపెన్'

● పరీక్ష సెంటర్ ప్రాంగణంలో బయటి వ్యక్తులు ● విచ్చలవిడిగా ఓపెన్ పరీక్షల్లో కాపీలు


బాలికల జూనియర్ కళాశాల ప్రాంగణంలో కాపీలు అందించేందుకు వెళుతున్న వారు

జమ్మలమడుగు, మార్చి 19: జమ్మలమడుగులో మంగళవారం జరిగిన ఓపెన్ పరీక్షల్లో విచ్చలవిడిగా కాపీలు జరిగాయి. స్థానిక అధికారులు పట్టించుకోవడంలేదని ఆరోపణలున్నాయి. అందులో భాగంగా జమ్మలమడుగు పట్టణంలో ముద్దనూరు రోడ్డులోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో కొంతమంది కాపీలను అందించారు. అయితే కళాశాల మ టైపిస్ట్ ఆమె గది కూర్చొని ఉంది. కానీ ఓపెన్ పరీక్షల ఇన్‌చార్జిలు ఆమె వద్దకు వచ్చి కళాశాల ప్రాంగణంలో ఎవరూ ఉండకూడదని తాళం వేస్తామని బయటికి వెళ్లిపోవాలని దురుసుగా ప్రవర్తించినట్లు టైపిస్టు తెలిపింది. దీంతో అక్కడ వాగ్వాదం చోటుచేసుకుంది. అయితే మరోవైపు కళాశాలలో విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారు. ఒక్కో గదిలో ఇద్దరు ఇన్విజిలేటర్లకుగాను అదనంగా బయటి వ్యక్తులు 8 నుంచి 10 మంది ఉండటం, కాపీలను అందించడం జరిగింది. కళాశాలలో రెగ్యులర్ సిబ్బందిపై ఓపెన్ సిబ్బంది విరుచుకుపడి మాట్లాడటం కాపీలు జరుగుతున్నాయని బయటికి సమాచారం పొక్కడం గందరగోళంగా మారింది. కాగా మంగళవారం మధ్యాహ్నం 2.30 గంటల నుంచి 5.30 గంటల వరకు పరీక్ష జరిగింది. ఓపెన్ ఇంటర్ పరీక్షల్లో కాపీల జోరు, కళాశాలలో గొడవ వాతావరణం పట్టణమంతా వ్యాపించింది. అయితే జమ్మలమడుగులో పరీక్షసెంటర్లలో కొందరు అధికారం ఉపయోగించి కార్యక్రమాలు జోరుగా నిర్వహిస్తున్నట్లు బహిరంగంగా ఆరోపణలు చేస్తున్నారు.

వడదెబ్బపై అవగాహన కలిగి ఉండాలి

బద్వేలు, మార్చి 19: పట్టణంలోని ఎస్‌బీవీఆర్ కళాశాలలో మంగళవారం ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో వడదెబ్బపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ వెంకటసుబ్బారెడ్డిమాట్లాడుతూ వడదెబ్బ సోకిన వ్యక్తికి విరోచనాలు, వాంతులు కావడం , జ్వరం రావడం, గుండె వేగంగా కొట్టుకోవడంతో పాటు మూత్రం పచ్చగా రావడం తదితర లక్షణాలు ఉంటాయన్నారు. వేసవికాలంలో కాటన్ దుస్తులు ధరించడం, ఓఆర్ఎస్‌లు, గ్లూకోజ్, మజ్జిగ తాగడం, కొబ్బరినీళ్లు, నిమ్మకాయ నీరు తీసుకోవడం వంటి వాటినుంచి రక్షణ పొందాలన్నారు.ఈ కార్యక్రమంలో ఎస్‌బీవీఆర్,డిగ్రీకళాశాలల ఎన్ఎస్ఎస్ యూనిట్-3 మహేష్, చరిత్ర అధ్యాపకులు రామచంద్రయ్య, కామర్స్ అధ్యాపకురాలు నాగమణి తదితరులు పాల్గొన్నారు.

స్ట్రాంగ్‌రూమును పరిశీలించిన కలెక్టరు

బద్వేలు టౌన్, మార్చి 19 : ఎన్నికల నేపథ్యంలో పట్టణ సమీపంలోని అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో స్ట్రాంగ్ రూములను మంగళవారం కలెక్టరు విజయరామరాజు పరిశీలించారు. స్ట్రాంగ్ రూముల్లో సౌకర్యాలు, పార్కింగ్, ఇతర వస్తువులపై ఆర్డీవోతో చర్చించారు. ఎటువంటి అసౌకర్యాలు లేకుండా గట్టి భద్రతానియమాలు పాటించాలన్నారు. స్ట్రాంగ్ రూము వద్ద గట్టిభద్రత ఏర్పాటు చేయాలని ఆయా అధికారులకు సూచించారు. రూట్ మ్యాప్‌లను సక్రమంగా నిర్వహించాలని, అలాగే ఆయా బూత్‌లకు ఈవీయంలు తరలించేటప్పుడు తగు జాగ్రత్తలు పాటించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఆర్డీవో, తహసీల్దార్లు, సీఐలు ఆయాశాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

గుడిసెలు తొలగించడంపై సీపీఐ ధర్నా

గోపవరం, మార్చి 19 : ఇల్లు లేని నిరుపేద లు వేసుకున్న గుడిసెలను తొలగించడంపై మంగళవారం స్థానిక తహసీల్దారు కార్యాలయం ఆవరణంలో సీపీఐ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీభూపోరాట కన్వీనరు రమణ మాట్లాడుతూ పీపీకుంట సమీపంలో రెండుమాసాల క్రితం 1564 సర్వేనెంబరులో ఇళ్లు లేని నిరుపేదలు గుడిసెలు వేసుకుని అక్కడ జీవిస్తున్నారు. అధికార పార్టీ నాయకులు, అమ్ముడుపోయిన తహసీల్దారు నిరుపేదల గుడిసెలు తొలగించే ప్రయత్నం చేయడం దారుణమన్నారు. కార్యక్రమంలో ఆ పార్టీ కార్యదర్శి పెంచలయ్య, బీకేఎంయూ మండల కార్యదర్శి ఖాదర్‌బాషా, అఖిల భారత యువజన సంఘం బద్వేలు ఏరియా నాయకులు బండి అనిల్‌కుమార్, భూపోరాట కమిటీ సభ్యులు కిరణ్, నరసింహ, ప్రసాద్, సుబ్బరాయుడు పాల్గొన్నారు.

కారును ఢీకొన్న స్కూటరు

● ఇద్దరికి గాయాలు

అట్లూరు, మార్చి 19 : అట్లూరు పోలీసుస్టేషన్ సమీపంలో బద్వేలు - కడప ప్రధాన రహదారిపై నిలిచి ఉన్న కారును మద్యం మత్తులో స్కూటరు ఢీకొనడంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు 108 ద్వారా వారిని కడప రిమ్స్‌కు తరలించారు. మండలంలోని గాయపడిన కోనరాజుపల్లె ఎస్సీ కాలనీకి చెందిన అట్లూరు గోపయ్య, మాదాపూర్ సుబ్బయ్య కడప రిమ్స్‌లో చికిత్స పొందుతున్నట్లు వారి బంధువులు తెలిపారు. సంఘటనాస్థలానికి పోలీసులు వచ్చినప్పటికీ ఎటువంటి ఫిర్యాదు అందలేదని వారు తెలిపారు.

రాచమల్లుకు వ్యతిరేకంగా పనిచేస్తాం


వైసీపీ మైనారిటీ కౌన్సిలర్ ఇర్ఫాన్

ప్రొద్దుటూరు .మార్చి 19 : ప్రొద్దుటూరులో వైసీపీ ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాద్‌రెడ్డికి ఎన్నికల్లో ఎట్టి పరిస్థితుల్లో మద్దతుగా ప్రచారం చేయబోమని ఆయనకు వ్యతిరేకంగా పని చేస్తామని పార్టీ అధిష్టానానికి స్పష్టం చెప్పామని వైసీపీ మైనారిటీ కౌన్సిలర్ ఇర్ఫాన్ బాషా తెలిపారు. మంగళవారం ఇస్లాంపురం వీధిలోని ఆయన స్వగృహంలో మాట్లాడుతూ ఇర్ఫాన్ మావాడని ఈ రోజు ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాద్‌రెడ్డి మాట్లాడటం హాస్యాస్పదంగా వుందన్నారు. మేము అసమ్మతి గుంపు కట్టిన తర్వాత రాచమల్లుకు వ్యతిరేకంగా ప్రచారం చేశాక ఇప్పుడు ఎన్నికల సందర్భంలో ఓట్లకోసం ఇర్ఫాన్ మావాడు నాపై అసమ్మతి లేదని ఎమ్మెల్యే అవాస్తవాలు చెబుతున్నాడన్నారు. ఎమ్మెల్సీ రమేష్ యాదవ్ ఒక బీసీ నాయకుడై వుండి ప్రోటోకాల్ వున్నా అతనిని ఏరోజూ కనీసం పార్టీ కార్యక్రమాలు, ప్రభుత్వ కార్యక్రమాలకు గానీ ఆహ్వానిం చకుండా అవమానించారన్నారు. ఆఖరికి అతనిని చంపుతామని బెదిరించి ప్రొద్దు టూరులోనే లేకుండా చేశారన్నారు. ఇదేనా బీసీలు, మైనారిటీల పట్ల మీరు చూపించే సామాజిక న్యాయం అన్నారు. ఇపుడు మీకు ఓట్లు కావాలి కాబట్టి ఇర్ఫాన్ మావాడు...రమేష్ యాదవ్ మావాడని సిగ్గులేకుండా అబద్ధాలు ప్రచారం చేసుకుంటున్నారన్నారు. ఇర్ఫాన్, రమేష్ యాదవ్,శివచంద్రారెడ్డి, మురళీధర్ రెడ్డి గానీ ఎవ్వరం రాచమల్లుకు మద్దతుగా ప్రచారం చేయబోమని అయనను ఓడించడమే తమ ఉమ్మడి లక్ష్యమని వైసీపీ మైనారిటీ కౌన్సిలర్ ఇర్ఫాన్ పేర్కొన్నారు.

వైసీపీ హయాంలో అభివృద్ధి నిల్


మోరగుడిలో భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహిస్తున్న భూపేశ్‌రెడ్డి

జమ్మలమడుగు, మార్చి 19: వైసీపీ హయాంలో అభివృద్ధి శూన్యమని జమ్మలమడుగు టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి విమర్శించారు. మంగళవారం జమ్మలమడుగు మండలంలోని మోరగుడి గ్రామంలో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ఇంటింటికి వెళ్లి బాబు ష్యూరిటీ, భవిష్యత్తుకు గ్యారెంటీ కరపత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ శివనాథరెడ్డి, జంబాపురం రమణారెడ్డి, దేవగుడి యూత్, జనసేన నాయకులు నాగార్జున, మోహన్‌రెడ్డి, సింగంరెడ్డి నాగేశ్వరరెడ్డి, లక్ష్మీరెడ్డి, వెంకటరామిరెడ్డి, విశ్వనాథరెడ్డి, బాలిరెడ్డి, ధనుంజయ, గురుశంకర్, చౌడంజొల్లు పాండులు, భాగ్యమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ఓటు ద్వారా వైసీపీని తరమండి


పథకాలు వివరిస్తున్న సరస్వతి, జ్యోతి

జమ్మలమడుగు, మార్చి 19: ప్రస్తుత సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు ఓటు ద్వారా వైసీపీ నాయకులను తరమాలని జమ్మలమడుగు టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి సతీమణి జ్యోతి, తల్లి సరస్వతి ప్రజలకు పిలుపునిచ్చారు. మంగళవారం జమ్మలమడుగు మండలంలోని పెద్దదండ్లూరు గ్రామంలో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని వారు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు సర్పంచ్ గువ్వల రామాంజనేయరెడ్డి, ధర్మాపురం సర్పంచ్ రమాదేవి, రమేష్‌రెడ్డి, శ్రీనివాసులు, రామక్రిష్టారెడ్డి, వరదరాజులు, రామకృష్ణ, చంద్ర, రామసుబ్బారెడ్డి, భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ నుంచి 50 కుటుంబాలు టీడీపీలోకి చేరిక


వైసీపీ నాయకులను టీడీపీలో చేర్చుకుంటున్న పుట్టా సుధాకర్‌యాదవ్

దువ్వూరు (మైదుకూరు రూరల్), మార్చి 19 : దువ్వూరు మండలంలోని ఎర్రబల్లెలో దాదాపు 50కుటుంబాలకు చెందిన వైసీపీ నాయకులు చాగంరెడ్డి లింగారెడ్డి, వీరనారాయణరెడ్డి, ధరణీరెడ్డి, బాల లింగారెడ్డి తదితరుల కుటుంబాలవారు మంగళవారం టీడీపీలోకి చేరారు. మైదుకూరు, ప్రొద్దుటూరు టీడీపీ అభ్యర్థులు పుట్టా సుధాకర్ యాదవ్, నంద్యాల వరదరాజులరెడ్డి సమక్షంలో టీడీపీలో చేరారు. ఈ కార్యక్రమంలో నాయకులు బోరెడ్డి వెంకట రమణారెడ్డి, జనసేన నాయకులు మల్లోత్ర పలువురు నాయకులు పాల్గొన్నారు.

గ్రామ కంఠంలో సమాధుల నిర్మాణంపై ఆర్డీవోకు ఫిర్యాదు

అట్లూరు, మార్చి 19 : మండలంలోని ఎస్.వెంకటాపురం గ్రామ కంఠంలో సమాధులు నిర్మిస్తున్నారంటూ బద్వేలు ఆర్డీవోకు స్థానికులు ఫిర్యాదు చేయడంతో మంగళవారం అట్లూరు డిప్యూటీ తహసీల్దారు రవిశంకర్ పరిశీలించారు. గ్రామకంఠం సర్వే నెంబరు 8లో 147 ఎకరాలు ఉండగా వందలసంవత్సరాల క్రితం పూర్వీకులు గంగమ్మ గుడిని నిర్మించారు. ఈ గుడికి అతి సమీపంలో సమాధులు నిర్మిస్తున్నారని గుడి సంరక్షకులు కుంభగిరి గ్రామానికి చెందిన వారు, మరికొందరు స్థానికులు గతంలో తహసీల్దారుకు ఫిర్యాదు చేసినప్పటికీ స్పందించలేదు.శవాలను పూడుస్తున్నా సమాధులు నిర్మిస్తున్న గ్రామ సేవకులు రెవెన్యూ అధికారులకు తెలపకపోవడంతో ఈ నిర్మాణాలు జరుగుతున్నాయని స్థానికులు డిప్యూటీ తహసీల్దారు రవిశంకర్ కు వెల్లడించారు. సమాధులు నిర్మించిన వారిని పిలిపించి తగు చర్యలు తీసుకుంటామని ఇక మీదట స్థలంలో ఎటువంటి సమాధులు కానీ, శవాలను పూడ్చడం జరిగినా గ్రామ సేవలకు చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. ఈకార్యక్రమంలో ఆర్ఐ ఖాదర్‌బాషా, వీఆర్వో వెంకటసుబ్బమ్మ, గ్రామ సహాయకులు పాల్గొన్నారు.

పంట పొలాలకు నీరు అందించి ఆదుకోండి

● ఉత్తర, దక్షిణ కాలువలకు నీరు విడుదల చేయాలని ఆయకట్టు రైతుల ఆందోళన


ఉత్తర కాలువలో నీరు లేక బయట పడిన రాళ్లు

జమ్మలమడుగు, మార్చి 19: మైలవరం జలాశయం ఆయకట్టు రైతులకు ఈసారి నీటి గండం ఏర్పడింది. మైలవరం జలాశయం నుంచి ఉత్తర, దక్షిణ కాలువలకు నొసం, తదితర ప్రాంతాల ఆయకట్టు రైతులకు జలాశయం నీరు అందించాల్సి ఉంది. ప్రస్తుతం జిల్లా అధికార యంత్రాంగం, స్థానిక ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడంతో రైతుల పంటపొలాలకు నీరు అందించలేని దుస్థితి ఏర్పడిందని ఆయకట్టు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మైలవరం జలాశయంలో ప్రస్తుతం జలాలు అడుగంటిపోయింది. గ్రామీణ, పట్టణ ప్రాంతాలకు అందించే నీటికే ఇబ్బందికరంగా మారింది. అయితే జలాశయం పక్కనే కొందరు రైతులు ఉత్తర కాలువ, దక్షిణ కాలువ, ఇరువైపుల వరి పంట సాగు చేశారు. బోర్లకు నీరు సక్రమంగా అందడంలేదని వాపోతున్నారు. వర్షాభావ పరిస్థితుల వలన సమస్య జటిలంగా మారిందన్నారు. ప్రస్తుతం ఎండాకాలంలో ఏప్రిల్, మే నెలలో నీటికి ఇబ్బంది పడే అవకాశం ఉన్నట్లుగా తెలుస్తోంది. పంట పొలాలకు చాలీచాలని నీటిని అందించి రైతులు ఆందోళన చెందుతున్నారు. ఉత్తర కాలువవైపు వరి పంటను కాపాడుకోవడానికి మోటార్ల ద్వారా పంటలకు నీరు అందిస్తున్నారు. మార్చి 15వ తేదీ నుంచి ఉత్తర, దక్షిణ కాలువలకు మైలవరం ఇరిగేషన్‌శాఖ అధికారులు నీటిని నిలుపుదల చేశారు. జలాశయంలో జలాలు అడుగంటిపోవడం వలన ఈ పరిస్థితి ఏర్పడినట్లుగా తెలుస్తోంది. మంగళవారం 'ఆంధ్రజ్యోతి' దినపత్రికలో 'ముంచుకొస్తున్న నీటి ముప్పు మైలవరం జలాశయంలో అడుగంటిన జలాలు, జమ్మలమడుగు, ప్రొద్దుటూరు, కడప నగరానికి పది రోజుల్లో నీటి సరఫరా ప్రశ్నార్థం' అనే కథనం ప్రచురితమైంది. దీంతో అధికారులు స్పందించినట్లు తెలుస్తోంది. ప్రొద్దుటూరు, కడప నగరానికి నీరు తరలించే పంప్‌హౌస్ వద్ద ఎమర్జెన్సీ హోల్ తొలగించినట్లు తెలిసింది. పక్కనే మట్టిని తొలగించారు. ఏదిఏమైనా తాగునీటికి ప్రస్తుతం ఇబ్బంది పడే అవకాశం ఉన్నట్లు, ఇక రైతాంగానికి నీరు అందించలేని దుస్థితి దారుణంగా మారింది. ఈ సమస్యకు సంబంధించి మైలవరం ఇరిగేషన్ శాఖ ఏఈ గౌతమ్‌రెడ్డిని 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా గండికోట జలాశయంలో ప్రస్తుతం 0.3 టీఎంసీ నీరు సుమారు అయిదు నుంచి ఆరు రోజుల వరకు మైలవరం జలాశయానికి చేరుతాయని ఆయన తెలిపారు. అయితే మంచినీటికి సమస్య రాకూడదని పంట పొలాలకు మాత్రం నీరు అందించలేమని తేల్చిచెప్పారు.


పంట పొలాలకు నీటికోసం ఏర్పాటు చేసుకున్న మోటార్లు